రైతులకు అందుబాటులో ఎరువులు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని ప్రతి పంచాయతీ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచుతామని, రైతులకు కావాల్సిన విత్తనాలు, సీజన్ల పంటలపై అవగాహణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. స్థానిక సోమిరెడ్డిపల్లె సచివాలయం పరిధిలో ఉన్న రైతుభరోసా కేంద్రం వద్ద సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఉద్యాన అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యాధికారి శిరీష హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రైతుభరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులకు పంటల సాగు విశయంలో అవగాహణ కల్పించారు. రైతులు వాడవల్సిన పురుగుమం దులు, ఎరువులపై రైతులకు సూచించారు. సీజన్‌లో పంటల సాగు దానిపై అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, సచివాలయం వ్యవసాయ అధికారి సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇంచార్జ్ వీసీ ప్రొఫెసర్ మునగాల సూర్య కళావతి అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా యూనివర్సిటీ లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మునగాల సూర్య కళావతి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొన్న ఆయన ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో భాగస్వాములయ్యారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రర్ రాజేష్ కుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ పవన్ కుమార్ రెడ్డి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

కార్యక్రమం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నగర మైనారిటీ అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, మాజీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, నగర మైనార్టీ అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్, రాష్ట్ర నాయకుడు సత్తార్, ఆరిఫుల్ల, అలీ ఖాన్, అక్రమ్, సాదికలి, అలెక్స్ సురేష్, ఆనంద్, పాల్గొన్నారు.

12న రూట రాష్ట్ర ఉర్దూ కాన్ఫరెన్స్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర ఉర్దూ కాన్ఫరెన్స్ ను జయ ప్రదం చేయాలని రూట రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ రాష్ట్ర ఉర్దూ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని స్థానిక సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ కడప నగరంలోని షాహిదర్బార్ ఫంక్షన్ హాల్ లో 12 వ తేదీ (నేడు) ఉదయం ఉర్దూ కాన్ఫరెన్స్, మధ్యాహ్నం రూట రాష్ట్ర శాఖ ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల అధికారి గా రూట రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, ఎన్నికల పరిశీలకులు గా రూట సీనియర్ నాయకులు అబుబకర్ సాహెబ్ వ్యవహరిస్తారని సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. రూట అసోసియేట్ అధ్యక్షులు షాహిదుల్లా మాట్లాడుతూ రాష్ట్ర సదస్సుకు ముఖ్యఅతిథిగా ఉపముఖ్యమంత్రి అంజద్‌బాష హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్తార్ ఫైజి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీం సాహెబ్, కో చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ రాయితీలను పునరుద్దరించాలి: కాంగ్రెస్

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: 60సంవత్సరాలకు పైబడిన వారికి అందించే ప్రయాణ రాయితీలను పునరుద్దరించాలని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి కోరారు. ఆ మేరకు విశాఖ పర్యటనకు విచ్చేసిన ప్రధాని మోదీకి వివరించినట్లు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 55సంవత్సరాలు నిండిన మహిళలు, 60ఏళ్లు పైబడిన వృద్దులకు రైలు ప్రయాణంలో 45శాతం రాయితీ అమలు చేసిందన్నారు. దీంతో వారు రాయితీపై పుణ్యక్షేత్రాల ను దర్శించుకునే భాగ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిం దన్నారు. అయితే కరోనా నేపథ్యంలో ఈ ప్రయాణ రాయితీలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కానీ కరోనా లాక్‌డౌన్ ముగిసిందని, పరిస్థితులన్నీ కూడా చక్కబడ్డాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాయితీలను పునరుద్ధరించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ విషయాన్ని విశాఖ పర్యటనకు విచ్చేసిన మోదీకి ఆ పార్టీ నాయకలు తీసుకెళ్లాలని తెలిపారు. లేదంటే ఇదే అంశాన్ని తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లి పునరుద్దరించేందుకు కృసి చేస్తానని వేలూరు వెల్లడించారు.

ఫైనాన్షియల్ మేనేజ్మెంట్‌పై అవగాహన

విశాలాంధ్ర-సిద్దవటం : 11వ ఏపీఎస్పీ బెటాలియన్లో శుక్రవారం చార్టెడ్ అకౌంటెంట్ కె.జి.ఎస్.ఎస్. తేజ ద్వారా ఆర్థిక సమస్యలు ఎలా అధిగమించాలో ఫైనాన్షియల్ మేనేజ్మెంట్‌పై అవగాహన సద్దస్సును నిర్వహించినట్లు కమాండెంట్ ఎన్. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ పై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కే. ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెంట్ వి. కేశవరెడ్డి, డీస్పీ/అసిస్టెంట్ కమాండెంట్ కే. వెంకటరెడ్డి, ఆర్ఐ లు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.6.60కోట్లతో జలజీవన్ మిషన్ పనులు

విద్యుత్ స్థంభాలు మార్చండి మహాప్రభో- నిధులు లేకున్నా పనులు ఎందుకు: మండల సమావేశంలో సభ్యుల ప్రశ్న

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలో గల 17 గ్రామ పంచాయతీల పరిధిలోని 28 గ్రామాలకు స్వచ్చమైన నీరు అందించేందుకు వీలుగా జలజీవన్ మిషన్ పథకం పనులను రూ.6.60కోట్లతో చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజారామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ మూలె లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగాఏఈ రామమోహన్ మాట్లాడుతూ ఈ పనుల ద్వారా అవసరమైన చోట్ల ట్యాంకుల నిర్మాణం, ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మొత్తం 48 పనుల కింద 2024 నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం కాగా నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా ఖర్చు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు జోక్యం చేసుకొని ఇప్పటి వరకు గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల మాట ఏమిటని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఈఓపీఆర్‌డీ రంతుల్లయ్య సమాధానమిస్తూ జలజీవన్ మిషన్ పథకం నిధులను ఇతరత్రా వాటికి మళ్లించేందుకు వీలు లేదన్నారు. పాత పనులకు సంబందించిన బిల్లులు సీఎఫ్ఎంఎస్ కింద నమోదు చేసి పంపడం జరిగిందన్నారు. ఈ మొత్తాలు ప్రాధాన్యత క్రమంలో మంజూరవుతాయని వెల్లడించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు మల్లు వెంకటమోహన్‌రెడ్డితో పాటు మరికొందరు సభ్యులు విరిగిన, వొంగిన విద్యుత్ స్థంభాల పునరుద్దరణకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఏఈ సుబ్బారావును నిలదీశారు. తాము పదేపదే ఈ సమస్యను అధికారుల దృష్టికి తెస్తున్నప్పటికీ ఫలితం లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు.అందుబాటులో స్థంభాలు ఉన్నప్పటికీ వాటిని అమర్చడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. దీనికి ఏఈ సుబ్బారావు సమాధానం ఇస్తూ ఇక్కడ రెగ్యులర్ ఏఈ లేని కారణంగా పనులలో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. త్వరలోనే స్థంభాల మార్పు పనులను చేపడుతామని హామీ ఇచ్చారు. చిలమకూరు పీహెచ్‌సీ వైద్యురాలు సురేష్మా మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటి వరకు 74శాతం మేర ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్డు ద్వారా రూ.5లక్షల మేర హెల్త్ ఇన్సురెన్స్ సౌకర్యం లభిస్తుందన్నారు. వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మందుల పిచికారికి సంబందించి 3 డ్రోన్స్ మంజూరయ్యాయన్నారు. ఒక్కొ పరికరం ధర రూ.10లక్షలు కాగా ఇందులో రూ.4లక్షలు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందన్నారు. రూ.5లక్షల మేర బ్యాంకు భరిస్తుందని మిగతా రూ.లక్ష రైతుల గ్రూప్ సభ్యులు చెల్లించాల్సి ఉందని వివరించారు. రైతులు 5 మంది ఒక గ్రూపుగా ఏర్పడితే ఈ పథకం వర్తిస్తుందన్నారు. పంచాయతీరాజ్ ఏఈ మాట్లాడుతూ సచివాల యాల పరిధిలో జరిగే అభివృద్ది పనులకు అవసరమైన సిమెంట్‌ను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని గుర్తుచేశారు. చిలమకూరు పశువైద్యాధికారి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎద్దుల, ఆవులకు లంపీస్కిమ్ వ్యాధి సోకుతోందని పేర్కొన్నారు. వ్యాధి సోకిన పశువులు తొలుత 102 నుండి 103 డిగ్రీల వరకు జ్వరం బారిన పడతాయని అనంతరం 5, 6 రోజుల వ్యవధిలో ఈ జ్వరం అధికమవుతుందన్నారు. ఇందుకు గాను సదరు పశువులకు టీకాలు ఇస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఏఓ త్రిమూర్తి రెడ్డి, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు విష్ణు, శేఖర్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీవో అసత్యాలు చెప్పడం మానుకోవాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరం చింతకొమ్మ దిన్నె మండలం మూల వంక దగ్గర ఉన్న ఊటుకూరు పొలంలోని ప్రభు త్వ భూములు ఆక్ర మించి బుద్ధ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ వాళ్ళు నిర్మిస్తున్న భావన టౌన్ షిప్ అక్రమ లేఔట్ పై రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఫిర్యాదు మేరకు పత్రికల్లో వచ్చిన కథనాలకు నిన్నటి దినం (గురువారం) ఆర్డిఓ ధర్మచంద్రారెడ్డి స్పందన పూర్తి అసత్యమని, అబద్ధాలని, అర్థసత్యాలను చెప్పి ప్రభుత్వాన్ని, ప్రజల్ని మోసం చేయడానికి ప్రయత్నం చేయడమేనని తీవ్రంగా విమర్శించారు, ఆర్ సి పి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మొత్తం వ్యవహారంలో ధర్మచంద్రారెడ్డి అధర్మంగా వ్యవహరిస్తున్నాడని ఆయన ధ్వజమెత్తారు. ఆయన చెప్పిన సర్వే నెంబర్లలో భూమి చుక్కల భూమి అయితే! ఆ భూమిలో వ్యవసాయం ఎవరు చేశారో చెప్పాలని ఆయన సవాల్ చేశారు. ఆర్డిఓకి నిజంగా గవర్నమెంట సొమ్మో తింటున్నామని వాళ్ళ కుటుంబంఅంతా జీతంతోనే బతుకుతున్నామని భావిస్తే ప్రభుత్వ భూమిని కాపాడడానికి ప్రయత్నం చేయాలని సవాల్ చేశారు. భావన టౌన్షిప్ ఏ పరిస్థితులను వదిలే ప్రసక్తే లేదని, ఈ భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకునే వరకు ఉద్యమం కొనసాగుతాదని, ఎట్టి పరిస్థితుల్లో వెనకడుగేసే పరిస్థితి లేదని హైకోర్టులో పిల్లు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, అవసరమైతే సిబిఐ కంప్లైంట్ చేస్తామని సందర్భంగా రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శేఖర్, మక్బూల్ బాషా, శంకర్ పాల్గొన్నారు.

చెత్త వేరు చేసే పద్దతిపై అవగాహన

విశాలాంధ్ర-పులివెందుల: చెత్త వేరు చేసే పద్దతిపై శుక్రవారం స్థానిక విద్యాధరి ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ డాక్టరు వరప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ ప్రాముఖ్యత, స్వచ్చత తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తడిచెత్త పొడిచెత్త, హానికర వ్యర్థాలు అను మూడు రకాల చెత్త ఉంటుందన్నారు. వీటిని వేరు చేసి చెత్త వాహనాలకు అందించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అలాగే జింక్‌ఫుడ్ తినడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపెకం తదితర అంశాల గురించి ఆయన విశదీకరించారు. కార్యక్రమంలో విద్యాధరి విద్యా సంస్థల సీఈఓ భానుప్రకాష్‌పాల్గొన్నారు.

ముస్తాక్ అహ్మద్ అరెస్ట్ అక్రమం: టీడీపీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: టీడీపీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్‌చేయడం దారుణం అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీల తరపున అలుపెరగని పోరాటం చేస్తూ ముస్లింల సంక్షేమం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ మైనార్టీ హక్కులకోసం పోరాడుతున్న తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను శుక్రవారం పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మైనార్టీ నాయకులపై పోలీసులు ప్రవర్తించిన తీరు చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానాలు కలుగుతుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరునికి ఉంటుందని, ఈ రకంగా మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడాల్సిన ప్రభుత్వం మైనార్టీలను నిర్వీర్యం చేస్తున్న సంధర్భంలో మైనార్టీ కార్పోరేషన్ కార్యాలయం నందు శాంతియుతంగా నిరసన చేస్తున్న మైనార్టీ రాష్ట్ర అధ్యక్షున్ని పోలీసులు దారుణంగా అరెస్ట్ చేయడాన్ని మైనార్టీ వర్గాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముస్తాక్ అహ్మద్ అక్రమ అరెస్టు తగదు

విశాలాంధ్ర-కమలాపురం : ముస్లిం మైనార్టీల తరపున అలుపెరుగని పోరాటం చేస్తూ ముస్లింల సంక్షేమం కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తూ మైనార్టీల హక్కుల కోసం పోరాడుతున్న మా టీడీపీ కాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్‌ని విజయవాడలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఖాదర్ భాషా అన్నారు. స్థానిక రైల్వే గేట్ సమీపంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లా మైనార్టీ వర్గాల ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్క పౌరునికి ఉంటుందని ఈ రకంగానే మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడాల్సిన ప్రభుత్వం మైనార్టీలను నిర్వీర్యం చేస్తున్న సందర్భంలో మైనార్టీ కార్పొరేషన్ ఆఫీస్ నందు శాంతియుతంగా నిరసన చేస్తున్నమా నాయకుడు షేక్ మౌలానా ముస్తాక్ అహ్మద్ ని పోలీసులు అతి దారుణంగా అరెస్టు చేయడాన్ని మైనార్టీ వర్గాల తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ముస్తాక్ అహ్మద్‌ని తక్షణమే విడుదల చేయాలని లేనిపక్షంలో ముస్లిం మైనార్టీ వర్గాల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రాఘవరెడ్డి, నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు అంకిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు ఆఖరునాటికి మార్కెట్ పునరుద్దరణ

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: డిసెంబరు ఆఖరు నాటికి కూరగాయల మార్కెట్‌ను పునరుద్దరిస్తామని వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్‌లు స్పష్టంచేశారు. రంగనాథస్వామి ఆలయ సమీపంలోని కూరగాయల మార్కెట్‌ను శుక్రవారం వారు పరిశీలించారు. ప్రస్తుతం కూరగాయల మార్కెట్‌లో ఆధునీ కరణ పనులు చేపడుతుండటంతో అక్కడి వ్యాపారులందరూ మార్కెట్ బయట ఆవరణంలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారులను వారు కలుసుకుని సమస్యల గురించి తెలుసుకున్నారు. మార్కెట్‌కు ప్రజలు రావాలంటే ఇబ్బంది పడుతున్నారన్న అంశం వ్యాపారు లు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన వారు వ్యవసాయ మార్కెట్‌లోకి తాత్కాలికంగా వ్యాపారాలు నిర్వహించుకునే ఏర్పాట్లు చేస్తామని వారు హామీనిచ్చారు. ఆ మేరకు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిన్నప్పతో కలిసి చర్చించారు. వీలైనంత వరకు డిసెంబరులో మార్కెట్ ఆధునీకరణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబరు ఆఖరు నాటికి రంగనాథస్వామి ఆలయం సమీపంలోని కూర గాయల మార్కెట్‌ను పునరుద్దరించేందుకు తమవంతు కృషి చేస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమంలో వారి వెంట మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ గోటూరు చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే బీసీలకు గుర్తింపు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలోనే బీసీలకు తగిన గుర్తింపుతో పాటు రాజ్యాధికారం పొందే అవకాశం కలిగిందని దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి నరసింహరావు పేర్కొన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యం లో నిర్వహించిన శ్రీశ్రీ కనకదాస జయంతి ఉత్సవాలలో ఆయన పాల్గొన్నా రు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో జన్మించి ఆధునిక కవిగా తత్వవేత్తగా, సంగీత కారుడిగా, స్వరకర్తగా మరియు గొప్ప భక్తుడిగా కన్నడ భాషలో ఆయన రచించిన కీర్తనలు ప్రాచుర్యం పొందాయన్నారు. కన్నడ భాషలో ప్రజలకు అర్థమయ్యేలా రచనలు చేశారని తెలిపారు. ఇప్పటికి కర్ణాటక ప్రభుత్వం అధికారికంగా శ్రీశ్రీ కనక దాస జయంతిని నిర్వహిస్తున్నారంటే ఆయన గొప్పతనం అర్థం అవుతుం దన్నారు. అలాంటి వ్యక్తులు ప్రస్తుత సమాజం లో కనుమరుగు అయ్యారని ఆయన అడుగుజాడల్లో మనమంతా పయనించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు, బీసీ నాయకులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను ముందుగా గుర్తించాలి

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : మండలంలోని కుష్టు వ్యాధిగ్రస్తులను ముందుగా గుర్తిస్తే వారికి వైద్య చికిత్స ద్వారా నయం చేసినవారవుతారని వారికి ఆరోగ్యకరంగా ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఒంటిమిట్ట పీహెచ్‌సీ డా.హిమశ్వేత అన్నారు.శుక్రవారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని స్థానిక వెలుగు ఆఫీసులో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమానికి మండలంలోని ఆశ కార్యకర్తలకు, వాలంటీర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించాల న్నారు. ఈ కార్యక్రమం ఈనెల 15నుండి వచ్చేనెల 5 వరకు ఉంటుందని ప్రతి ఆశకార్యకర్త, వాలంటీర్ ప్రతి రోజు ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ నాగరాజు, సీహెచ్ఎన్ ఇందిర, సూపర్‌వైజర్ బాష, ఫిమేల్ సూపర్‌వైజర్ లక్ష్మీనరసమ్మ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు ఆజాద్

కమాండెంట్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-సిద్దవటం : బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమర యోధులలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఒకరని 11వ ఏపీఎస్పీ కమాండెంట్ ఎన్ శ్రీనివాసరావు కొనియాడారు. మండలంలోని భాకరాపేట సమీపంలో వున్న ఏపీఎస్పీ బెటాలియన్లో శుక్రవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1888 నవంబర్ లో జన్మించిన మౌలానా 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలు అందిం చారన్నారు. ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఈయనకు భారతరత్న అవార్డు సైతం ఇచ్చిందన్నారు. ఈయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ కే. ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెంట్లు వి. కేశవరెడ్డి, కే. వెంకటరెడ్డి, ఆర్ఐ లు, ఆర్ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

లంకమల అందాలు అద్భుతం

సిద్దవటం కోటను సందర్శించిన జిల్లా జడ్జి దంపతులు

విశాలాంధ్ర-సిద్దవటం : లంకమల అందాలు అద్భుతంగా ఉన్నాయని జిల్లా జడ్జి సల్మాన్ రాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. లంకమల అభయారణ్యంలోని రోళ్లబోడు బీటు, సిద్దవటం కోటను శుక్రవారం జడ్జి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు కోటలోని శిల్పకళా సౌందర్యాన్ని, కోట విశిష్టతను కోట సిబ్బంది వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం జడ్జి శ్రీనివాస కళ్యాణ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-జమ్మలమడుగు: జమ్మలమడుగు శాసనసభ్యులు డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధి లోని 15వ వార్డులో పర్యటించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఈ మూడేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ఇంటి ఇంటికి తిరిగి ప్రజలకు వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అలాగే టౌన్ బ్యాంక్ బాధితులు కలిసి తమకు త్వరగా న్యాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి కి తెలిపారు. ఎమ్మెల్యే స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో నేరుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మునిసిపల్ చైర్ పర్సన్ శివమ్మ, వైస్ చైర్మన్ సింగరయ్య ,పట్టణ వైసీపీ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర రెడ్డి, చేనేత పరిష్కార కమిటీ మాజీ సభ్యులు చంద్రమౌళి ,ఆంధ్ర ప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ చైర్ పర్సన్ శ్రీమతి బడిగించల విజయలక్ష్మి, మార్బల్ శ్రీను, కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సకల సేవలు

విశాలాంధ్ర-బద్వేల్ : ఆంధ్రప్రదేశ్ సచివాలయాల్లో అన్ని సేవలు అందుబాటులోకి వచ్చినట్లు వైసీపీ అట్లూరు మండల నాయకుడు పోతిరెడ్డి రెడ్డయ్య అన్నారు. శుక్రవారం విశాలాంధ్ర విలేకరితో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించి ప్రజలకు సత్వరమే సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వెసులుబాటు కల్పించారన్నారు. ముఖ్యంగా రైతులకు సంబంధించి ఈపాస్‌బుక్కు, 1బి అడంగల్, ముటేషన్, పీఎం కిసాన్, ఈకెవైసీ, పాస్‌పోర్టు, టెలీమెడిసిన్ తదితర సేవలను ప్రజల ముంగిటనే ఆయా గ్రామ పంచాయతీల సచివాలయాల్లో అందిస్తున్నారన్నారు. ప్రతి రోజు స్పందన అర్జీలు కూడా స్వీకరిస్తున్నట్లు ఆయా అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు.

వేమన విగ్రహాన్ని ఏర్పాటు చేసే వరకు పోరాటం : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-కడప వైవీయూ : వైవీయూ ప్రధాన గేటు ముందు కూడలి ఏర్పాటు చేసి ఆ కూడలి మధ్యలో 20 అడుగుల వేమనకాంస్య విగ్రహం ను ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆగదని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగా సురేష్ తెలిపారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ వైవీయూలో ఉన్న వేమన విగ్రహాన్ని తొలగించి ఆ స్థానంలో వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు చేశారని తూతూ మంత్రంగా కొత్తగా నిర్మించిన ప్రధాన గేటు ముందు వేమన విగ్రహం అతి చిన్న విగ్రహం ఏర్పాటు చేయటం సమంజసం కాదని ప్రజాకవి, తెలుగు తాత్వికుడు వేమన అని అందుకోసం విశ్వవిద్యాలయానికి యోగి వేమన విశ్వవిద్యాలయం అని పేరు పెట్టారని ఆయన పేరుకు తగ్గట్టుగా కొత్తగానిర్మించిన ప్రధాన ద్వారం ఎదురుగా కూడలి ఏర్పాటు చేసి కూడలి మధ్యలో పది అడుగులదిమ్మె 20 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. విశ్వవిద్యాలయ అధికారులు స్పష్టమైన నిర్ణయం తీసుకో వాలని లేనిపక్షంలో ఆందోళనలో తీవ్రతరం అవుతాయన్నారు.

ప్రత్యేక హోదాపై ప్రశ్నించలేని జగన్‌పై ఏపీ ప్రజలు పోరాడాలి

విశాలాంధ్ర-కడప రూరల్ : స్థానిక పాత కలెక్టర్ ఆఫీస్ ఆర్డిఓ కార్యాలయం ఎదుట సీపీఐ, సిపిఎం వామపక్షాల పార్టీల ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం విశాఖపట్నం వస్తున్న సందర్భంగా రాష్ట్రానికి పార్లమెంటు చేసిన ప్రత్యేక హోదా చట్టాన్ని అమలు చేయని కారణంగా "మోడీ గో బ్యాక్" నిరసన ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు పి.కృష్ణమూర్తి, ఎల్.నాగ సుబ్బారెడ్డి, సిపిఐ కడప నగర కార్యదర్శి వెంకట శివ, సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు బి.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సిపిఐ కడప నగర కార్యదర్శి వెంకట శివ మాట్లాడుతూ బిజెపి మోడీ పరిపాలనపై రాష్ట్ర ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో మండిపోతూ ఉంటే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై మాట్లాడకుండా రాష్ట్రంలో పర్యటించడానికి జగన్ దగ్గరుండి స్వాగతం పలకడం హేయమైన చర్య అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు ఎల్.నాగ సుబ్బారెడ్డి, పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా చట్టాన్ని అమలు చేయమని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏపీలో నిర్మాణం చేయాలని, రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు నిధుల కోసం మోడీ సభలోనే, జగన్ నిలేయాలని లేకుంటే రాష్ట్ర ప్రజలు ఎవ్వరు కూడా జగన్ను విశ్వసించరని వారు తెలిపారు. సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్, సీపీఎం సీనియర్ నాయకులు బి.నారాయణ మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు సీఎం జగన్ మెజార్టీ ఎంపీ సీట్లు రాష్ట్ర ప్రజలు ఇస్తే కేంద్రంలో మోడీ ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా కేంద్రంపై రాజీలేని పోరాటం చేస్తానని చెప్పి గెలిచాక మోడీ ఆడమన్నట్లుగా ఆడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు వేణుగోపాల్, మద్దిలేటి, మనోహర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మనోహర్, కే.శ్రీనివాస్ రెడ్డి, ఎం.పాపిరెడ్డి, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



కడప జిల్లాలో పలువురు సీఐలు బదిలీలు

విశాలాంధ్ర-కడప క్రైం : జిల్లాలో పలువురు సీఐలను ప్రభుత్వం బదిలీ చేసింది. పోరుమామిళ్ల సిఐ రమేష్ బాబు కడప విఆర్‌కు బదిలీ అయ్యారు. కలకడ సిఐగా ఉన్న సురేష్ రెడ్డి పోరుమామిళ్ల సిఐగా బదిలీ, కడప రూరల్ పోలీస్ స్టేషన్ సిఐగా ఉన్న శ్రీరామ శ్రీనివాసులు కడప విఆర్‌కు బదిలీ, చిన్నచౌక్ సీఐగా ఉన్న అశోక్ రెడ్డి కడప రూరల్ పోలీస్ స్టేషన్ సిఐగా , వేంపల్లి సిఐ సీతారామరెడ్డి కడప విఆర్‌కు, జమ్మలమడుగు సిఐ వెంకటేశ్వర్లు వేంపల్లి సిఐగా,ఒంటిమిట్ట సిఐ రాజా ప్రభాకర్ కడప విఆర్‌కు,అన్నమయ్య జిల్లా విఆర్‌లో ఉన్న పురుషోత్తం రాజు ఒంటిమిట్ట సిఐగా బదిలీ అయ్యారు. తిరుపతి విఆర్ లో ఉన్న వెంకటేశ్వర్లు పులివెందుల ట్రాఫిక్ సిఐగా నియామకవం అయ్యారు. ఇప్పటికే రిమ్స్ సీఐగా ఉన్న సదాశివయ్య జమ్మలమడుగు అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. జమ్మలమడుగు సిఐ వెంకటేశ్వర్లు వేంపల్లి సిఐగా బాధ్యతలు స్వీకరించారు. కడప డిఎస్బిలో ఉన్న సిఐ రామచంద్ర రిమ్స్ సిఐగా బాధ్యతల స్వీకరించారు.

ఎస్.జి.ఏఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర -కమలాపురం : పులివెందలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 10వ తేదీన జరిగిన షార్ట్ పుట్ బాల్ బేస్ బాల్ క్రీడా లో ప్రతిభ కనబరిచిన డిఏవి భారతి విద్యా మందిర్ విద్యార్థులు ఆ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు అభినందనలు తెలిపారు. బాల్ బేస్ బాల్ క్రీడలో అండర్ 17 విభాగంలో డి. హర్షిత అండర్ 14 బాలికల విభాగంలో పి. గౌస్ ఇవ్యాంజలిన్ వి. హరిత ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రధాన ఉపాధ్యాయుడు యస్. కిషోర్ కుమార్ తెలిపారు. విజేతలైన విద్యార్థులలో రాష్ట్రస్థాయి షార్ట్ బాల్ బేస్ నందు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో చందు, ఆధ్యాపక బృందం పాల్గొన్నారు.

నాసర్ ఆలీకి సన్మానం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని హబీబుల్లా వీధిలో గల బాలకృష్ణ అండ్ జూనియర్ ఎన్టీఆర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేసిన సి ఎస్ నాసర్ అలీకి సన్మానం చేసిన తెలుగుదేశం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, షేక్ అల్లాభకాష్ సందా నరేంద్ర కుమార్, ప్రేమ్ కుమార్, రాఘువ, షామీర్ బాష ఉన్నారు.

బాలలకు వివిధ రకాల పోటీలు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని మండలంలోని రామాయపల్లె ఎంపీపీ పాఠశాల యందు బాలలకు ఆటల పాటల పద్యాల చేతిరాత తదితర పోటీలను నిర్వహించినట్లు ప్రధాన ఉపాధ్యాయులు తుపాకుల శ్రీనివాసులు తెలిపారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రధానం బాలల దినోత్సవం నాడు ఉంటుందని తెలిపారు. మన్నూరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మన్నూరు రామ్మోహన్ రెడ్డి ఆర్థిక సహకారంతో బహుమతి ప్రధానం ఉంటుందని తెలిపారు. ఆటలు పాటలు బాలల మనోవికాసాన్ని ఏకాగ్రతను దేహ దారుడ్యాన్ని పోటీ తత్వాన్ని పెంచుతాయన్నారు.

నేడు దేవరకోనలో వనభోజనం

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలం వెలిదండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దేవరకోనలో శనివారం వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీనియర్ పాత్రికేయులు యాగంటి బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కాగా కార్తీకమాసంలో ఉసిరి చెట్టుకింద వండిన భోజనం చేస్తే పుణ్యం లభిస్తుందన్నారు. కార్తీకమాసంలో పార్వతీ పరమేశ్వరులు ఉసిరి చెట్టు కింద కొలువుదీరి ఉంటారని విష్ణుపురాణం చెబుతోందన్నారు. సకల ఔషదగుణాల సిరిగా పిలువబడే ఉసిరి చెట్టును ఆరోగ్య ప్రదాయనిగా ప్రజలు భావిస్తారన్నారు. అందుకే కార్తీకమాసంలో ఉసిరి చెట్టు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కావున భక్తాదులందరూ దేవరకోనకు విచ్చేసి కార్తీకమాసం వనభోజన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.

రేపు హిమంకుంట్లలో ఉచిత వైద్యశిబిరం

విశాలాంధ్ర-పులివెందుల: సింహాద్రిపురం మండలం హిమకుంట్ల గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం గుండెకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శశిభూషణంరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అనంతపురం కిమ్స్ సవేరా వైద్యశాలకు చెందిన కార్డియాలజిస్టు స్పందన వైద్యశిబిరంలో చికిత్సలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మధు రెడ్డి నామినేషన్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా నేడు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పోటీ చేయుటకు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రితం రెడ్డి సహకారంతో నామినేషన్ దాఖలు చేసిన వెన్నపూస మధు రెడ్డి ఆయనతో పాటు పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య సురేష్ పాలగిరి శివ బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో రాష్ట్రస్థాయి పోటీలకు పులివెందుల విద్యార్థి

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందులకు చెందిన హనుమంత్ తేజ అను విద్యార్థి యోగాలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి కడప స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు కడపలో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలకు హాజరయ్యారు. ఈ పోటీలో తేజ అత్యంత ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు యోగా మాస్టరు రామలింగారెడ్డి తెలిపారు. అండర్-17 జిల్లా స్థాయిలో యోగా పోటీలకు పాఠశాల నుంచి మొత్తం 6 మంది విద్యార్థులు హాజర య్యారన్నారు. ఈ పోటీలలో తేజ ఒకరు మాత్రమే రాష్ట్రస్థాయికి కావడం అదృష్టమన్నారు. మిగిలిన వారు కూడా తదుపరి పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. తేజ ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రస్థాయిలో కూడా తేజ అద్భుత ఫలితాలను సాధిస్తారని వారు ఆశాభావం వ్యక్తంచేశారు.

రాష్ట్రాన్ని అన్ని విధాల మోసం చేసిన మోడీ

విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఐ నిరసన ర్యాలీ

విశాలాంధ్ర-కడప రూరల్ : ఏపీని మోదీ అన్ని విధాలుగా మోసంచేసి సిగ్గు ఎగ్గూ లేకుండా విభజన హామీలను అమలు తుంగలో తొక్కి వస్తున్నారని ఒక్క అంశంలోనైనా మోదీ ప్రభుత్వం న్యాయం చేసిందాని సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆలోచించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆరోపించారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి ప్రారంభమయిన సీపీఐ ర్యాలీ వన్ టౌన్ సర్కిల్, చెన్నూరు బస్టాండ్, 2వ గాంధీ విగ్రహం మీదుగా మట్టి పెద్దపులి, చిలికలబావి సీపీఐ కార్యలయం వరకు నిర్వహించారు. మోడీ గోబాక్,ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రవేటు పరం చేయవద్దని, విభజన హామీలు అమలు చేయాలని, కడపలో ఉక్కు పరిశ్రమ సేయల్ అధ్యర్యంలో నెలకొల్పాలని నినదించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం చేయవద్దని ముంక్త కంఠంతో ఆందోళనలు చూసైన ప్రధాని మోడీ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచుతామని స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు ప్రజలకు ద్రోహం చేసిన వారికే ప్రజల సొమ్ముతో పెద్ద పీట వేస్తున్నారని ఆరోపించారు. లాభాల్లో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎవరీ కోసం ప్రైవేట్ పరం చేస్తున్నారని నిలదీశారు. మోదీ నిర్ణ యానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో జగన్ తీర్మా నం చేశారని, ఇప్పుడు ఏమీ చేయకుండానే సాగిల పడి స్వాగతం పలుకుతారా అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రానికి విభజన హామీల అమలుకు పట్టు పట్టాలనీ కడపలో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభం అయ్యేట ట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి.సుబ్బారెడ్డి, జి.వేణుగోపాల్, బషిరున్నిసా, విజయలక్ష్మి, నగర సహాయ కార్యదర్శి కేసి.బాదుల్లా, జిల్లా సమితి సభ్యులు సావంత్ సుధాకర్, మునయ్య, లింగన్న, ఆర్.బాబు, బాష, భవాని శంకర్, పక్కిరప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, సుబ్బారాయుడు, నాయకులు శివ, ఇన్సాఫ్ నగర కార్యదర్శి మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి: ఎంపీపీ

విశాలాంధ్ర - చెన్నూరు : ప్రతి రైతుకు ఆ గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పంటలపై అవగాహన కల్పించాలని మండల పరిషత్ అధ్యక్షుడు చీర్ల సురేష్ యాదవ్ పేర్కొన్నా రు. శుక్రవారం మండలంలోని చెన్నూరు రైతు భరోసా కేంద్రం-2 లో మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎర్రసాని మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీ కాలువకు నీళ్లు ఉన్న పంటలు వేసేందుకు రైతులు ముందుకు రావడం లేదని, వారు పండించే పంటకు గిట్టుబాటు ధర రావడం లేదని ,అలాగే పంట కూడా సరిగా రాకపోగా ఖర్చులు అధికంగా అవుతున్నాయనే భావనలో రైతులు ఉన్నారని పేర్కొన్నారు. వరి కాకుండా వేరే పంటలు వేసుకునేం దుకైనా రైతులకు ఆ పంటపై అవగాహన కల్పించి పంటలు పెట్టుకునేందుకు అధికా రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఉదయం 10 గంటలకు కూడా తెరవడం లేదని రైతులకు కావాల్సిన మందులు ఉదయాన్నే తీసుకెళ్తారు కాబట్టి ఆ గ్రామంలోని ఒక వాలంటీరుకు బాధ్యతలు అప్పగించి ఉదయం ఏడు గంటలకు ఆర్బికేని ఓపెన్ చేసే విధంగా చేయాలని పేర్కొన్నారు. మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేసేటప్పుడు ఏదో మొక్కుబడిగా చేసామనేది కాకుండా సంబంధిత శాఖల అధికారులను పిలిపించి ముందుగా వారికి సమాచారం ఇచ్చి అందరూ హాజరయ్యేటట్లు చూడాలని పేర్కొన్నారు. రైతులు పండించిన వరి ధాన్యంలో నల్ల గింజ ఉన్న ప్రభుత్వం రైతుల దగ్గర నుండి కొనేటట్లు ఉన్నతాధికారులకు సూచించాలని పేర్కొన్నారు. రైతు భరోసా డబ్బులు పడని వారు మరల రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జివిఎస్ భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో జాన్ వెస్లీ, వ్యవసాయ అధికారి శ్రీదేవి, బయనపల్లి సర్పంచ్ చంద్రయాదవ్, నీలం వెంకటసుబ్బారెడ్డి, ఎస్టీ సెల్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించండి

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండలంలోని మల్లెపల్లె, తోట్లపల్లె, సోమిరెడ్డిపల్లె-3, డి.నేలటూరు, డిరసవంచ, నాగిశెట్టిపల్లె సచివాలయాల పరిధిలోని గ్రామాలలో లెప్రసీ వ్యాధిపై పకడ్బందిగా సర్వే నిర్వహించాలని స్థానిక డాక్టర్ ఫల్లణిరాజ్ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని సచివాలయాలలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి లెప్రసీ వ్యాధిపై సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. లెప్రసీ వ్యాధికి సంబంధించిన పొడలు, మచ్చలు ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పంపించాలన్నారు. ఈ వ్యాధి మందులు వాడితే నయం అవుతుందన్నారు. దీనివల్ల భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సంపత్ కుమార్, సీహెచ్ఓ సాంబశివారెడ్డి, సూపర్‌వైజర్ రవణమ్మ, హెల్త్ అసిస్టెంట్లు మాధవనాయుడు, వెంకటసుబ్బయ్య, రక్తపరీక్ష అధికారి రమణకుమార్ పాల్గొన్నారు.

గ్రీన్‌స్పాట్ల పనులు ప్రారంభం

నాడు అలా - నేడు ఇలా

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక పురపాలిక పరిధిలో పచ్చదనం, పరిశుభ్రత పెంపులో భాగంగా బ్లాక్‌స్పాట్ల స్థానంలో గ్రీన్‌స్పాట్ల ఏర్పాటు పనులు మున్సిపల్ అధికారులు శుక్రవారం ప్రారంభిం చారు. ఇందులో భాగంగా 6, 7 సచివాలయాల పరిధిలోని బస్టాండు వెనుక ప్రాంతం, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వద్ద వ్యర్థాలను తొలగించి శుభ్రపరచారు. ఆయా ప్రాంతాలలో ఆకర్షనీయంగా ముగ్గులు వేసి అందంగా రంగులు దిద్దారు. ఈ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచిస్తూ అక్కడ సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కమీషనర్ జగన్నాథ్ ఆదేశానుసారం ఎన్విరాల్‌మెంట్ ఏఈ సందీప్ ఆధ్వర్యంలో శానిటరీఇన్‌స్పెక్టర్ మధుకుమార్ పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్‌తో పాటు శానిటరీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ భూమిపూజకు అందరు ఆహ్వానితులే: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: నియోజకవర్గంలోని 22వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగం గా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంధర్భం గా ఆయన వార్డులో గల ప్రజలకు ఈనెల 15వ తేదిన ప్రొద్దుటూరు నూతన కూరగాయల మార్కెట్ భూమిపూజ కార్యక్రమం ఆహ్వాన పత్రికను వార్డులోని ప్రతి ఒక్కరికి అందచేస్తూ వార్డులో సమస్యలు ఏవైనా ఉన్నాయా అని తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. జగనన్నా ప్రవేశఫెట్టిన పథకాల ద్వారా లబ్దిపొందిన ప్రజలతో మాట్లాడారు. అక్కా చెల్లెమ్మల ఆనందమే ముఖ్య మంత్రి ధ్యేయం అన్నారు. మొదటి నుండి తనపట్ల ప్రజలు ఎనలేని అభిమానాన్ని చూపుతు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బి.లక్ష్మీదేవి, వైస్‌చైర్మెన్ బంగారురెడ్డి, కౌన్సిలర్ వడ్ల ఇబ్రహీం, ఖలీల్, వైకాపా నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, వడ్ల దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు ముహూర్త ఖరారు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్రను 2023, జనవరి 27న చిత్తూరు జిల్లా కుప్పం నుంచి ప్రారంభిస్తున్నట్లు కర్నాటి నాగభూషణం రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కర్ణాటక అమర్నాథ్ రెడ్డి లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు సాగనున్న యాత్ర. ఏడాది పాటు ప్రజల మధ్యే ఉండే విధంగా పాదయాత్ర రూట్ మ్యాప్, యువత ఎదుర్కొంటున్న సమస్యలు.. నిరుద్యోగం ప్రధాన అంశాలుగా సాగనున్న లోకేశ్ పాదయాత్ర. తెలుగు యువతను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసుకుంటూ ముందుకు సాగే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని, పాదయాత్రలో నిరంతరం అనుసరించేలా చూడాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి అమరనాథ రెడ్డికి ఆయన సూచనలు చేయడం జరిగింది. వీరితో పాటుగా నారా లోకేష్ ని మాసాపేట శివ, దుంప వెంకటేశ్వర రెడ్డి, ఎస్ సి సెల్ నవీన్, చిన్నరాముడు, నారాయణ స్వామి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : చింతకొమ్మ దిన్నె మండలం ఆజాద్ నగర్‌లోని ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా యునైటెడ్ ముస్లిమ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆజాద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పిల్లలు ఏర్పాటు చేసిన ఆజాద్ జీవిత ముఖ్య విశేషాల ఫోటో గ్యాలరీని ప్రారంభించారు. అనంతరం ప్రతిభ కనబరచిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఆజాద్ గురించి నిర్వహించిన వ్యాస రచన పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మెమొంటోలను కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, స్కూల్ సిబ్బంది, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యధావిదిగానే దొరస్వామి నాయుడి విగ్రహం

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధిలోని పాత జూనియర్ కళాశాలలో దొరస్వామి నాయుడి విగ్రహం యదావిధిగానే ఉంటుందని వైసీపీ సీని యర్ నేత వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిసల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్‌లు హామీనిచ్చారు. వివరాల్లోకి వెళితే,. పాత జూనియర్ కళాశాలలో ఎప్పటి నుంచో దొరస్వామినాయుడి విగ్రహం ఉంది. అయితే ఇటీవల కాలంలో జూనియర్ కళాశాల ఆధునికీరణ పనులు చేపట్టారు. ఆ ప్రాంతమంతా కూలదోసి కొత్త భవనాలు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో విగ్రహం మళ్లీ ఏర్పాటు చేస్తారో లేదోనన్న ఆలోచన దాత మనుమడిలో మొదలైంది. ఈ నేపథ్యంలో కృష్ణదేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో సంఘం పెద్దలు, దొరస్వామి నాయుడి మనుమడు బలరామ్‌నాయుడులు శుక్రవారం వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వరప్రసాద్‌లను కలిసి సమస్యను విన్నవించారు. ఇందుకు స్పందించిన వారు దొరస్వామి నాయుడి విగ్రహం యదావిదిగానే ఉంటుందని వారు హామీనిచ్చినట్లు సంఘం పెద్దలు ఈ సందర్భంగా వెల్లడించారు.

ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలి

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య కోరారు. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఎర్రిపల్లిలో శుక్రవారం ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించి నిల్వ ఉన్న నీటిలో అబేట్ పిచికారి చేయించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరాలు వచ్చినట్లయితే వెంటనే రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే దోమ కాటు వల్లనే మలేరియా, డెంగ్యూ జ్వరాలు వస్తాయన్నారు. కావున దోలిమకాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ కచ్చితంగా దోమతెరలు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సరస్వతి, త్రివేణి పాల్గొన్నారు.

ఒంటిమిట్ట సీఐగా పురుషోత్తమరాజు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పురుషోత్తమరాజు సోమవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అన్నమయ్య జిల్లా వీఆర్‌లో ఉన్న పురుషోత్తమరాజును ఒంటిమిట్ట సీఐగా నియమించినట్లు తెలుస్తోంది. ఒంటిమిట్టలో సీఐగా పనిచేస్తున్న రాజాప్రభాకర్‌ను కడప వీఆర్‌కు బది లీ చేసినట్లు తెలుస్తోంది. ఒంటిమిట్ట సీఐగా ఇక్కడ పనిచేస్తున్న రాజాప్రభాకర్ ప్రజలకు మంచి సేవలు అందించారని ఆయన బదిలీ కావడం బాధాకరమని పలువురు స్థానికులు అనుకుంటున్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శంగా తీసుకోవాలి...

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప నగరంలోని కలెక్టరేట్ ఆవరణలోని స్పందన మీటింగ్ హాల్లో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి అర్పించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని దేశ యువత, విద్యార్థులు, ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, మౌలానా ఆజాద్ లాగా తమ నడవడికలను అలవరచుకోవాలని జిల్లా సమగ్రశిక్ష పథకం అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్య భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా, విద్యారంగ వ్యాప్తికి బాటలు వేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను ప్రతి ఒక్కరమూ స్మరించుకుందామన్నారు. రానున్న కాలంలో విద్యార్థులు ప్రజలు ఆయనను ఆదర్శంగా తీసుకొని సరైన మార్గంలో నడవాలని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చెప్పలి దేవరాజు, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి వెంకట కిషోర్ విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేపై శిక్షణ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండలంలోని చిలమకూరు పీహెచ్‌సీ పరిధిలో ఈ నెల 15 నుండి వచ్చే5 వరకు కొనసాగనున్న కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమంపై పీహెచ్‌సీ వైద్యురాలు సాయిచరిత ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. సర్వే ద్వారా వ్యాధి గ్రస్తులను గుర్తించడం జరుగుతుం దన్నారు. ముందస్తు గుర్తింపు వలన సదరు రోగి అంగవైకల్యం చెందకుండా మందులు ఇచ్చి నివారించడం జరుగుతుందని వివరించారు. స్పర్శలేని పొడలు శరీరంపై ఉంటే హాస్పిటల్‌కు రెఫర్ చేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రమాదేవి,హెల్త్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ పర్యటనపై కాంగ్రెస్ శ్రేణుల నిరసన

విశాలాంధ్ర-వేంపల్లె: ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాని మోదీ పర్యటనను పరస్కరిం చుకుని కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తంచేశారు. ఆ మేరకు వేంపల్లె కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో శుక్రవారం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంటు తులసిరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ఎనిమిదన్నరేళ్ల పాలనలో ఏ ఒక్క హామీకూడా బీజేపీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. పైగా హోదా అంశం ముగిసిన అధ్యాయమని బహిరంగంగా తేల్చిచెప్పడం సిగ్గుకేటన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా మోసం చేసినందుకు మోదీ పర్యటనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తులసిరెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ఒక్కటే ఆంధ్రప్రదేశ్‌కు ఆత్మబంధువన్నారు. విభజన అంశాలు పూర్తిస్థాయిలో నెరవేర్చడం కూడా కాంగ్రెస్‌కు సాధ్యమన్నారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా తమపార్టీ అగ్రనేత ఈ అంశాలపై స్పష్టత ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, ఉత్తన్న, రాఘవయ్య, బద్రి, రామకృష్ణ పాల్గొన్నారు.

నరేంద్ర మోడీ గోబ్యాక్ : సీపీఐ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : దేశ ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం వస్తున్న సంద ర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ తరపున నుండి ప్రధాని మోదీ పర్యటన ను వ్యతరేకించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీర శేఖర్, ఏరియా కార్యదర్శి జకరయ్య రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఏరియా కార్యవర్గ సభ్యులు, పిడుగు మస్తాన్, బాల ఓబయ్య, రవికుమార్, సివి రమణ, జాకోబ్, చెన్నయ్య, శాఖ కార్యదర్శులు, బెల్లం భాష, వెంకటేశ్వర్లు, షఫా, చాంద్ భాషా, ప్రసాద్, సునీల్, పాల్గొన్నారు.

తిరుమల మహా పాదయాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-సిద్దవటం : ఈ నెల 18 వ తేది జెట్పీచైర్మెన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి చేపట్టే తిరుమల మహా పాదయాత్రను జయప్రదం చేయాలని వైఎస్ఆర్సీపీ రైతు విభాగం మండల కన్వినర్ పల్లె సుబ్బరామిరెడ్డి, వైఎస్ఆర్సీపీ మండల ప్రధాన కార్యదర్శి కేవి సుబ్బయ్యలు తెలిపారు. మండలంలోని భాకరాపేట ప్రసన్నాంజనేయ ఆలయంలో శుక్రవారం మహాపాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ ఆకేపాడులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవమూర్తు లకు కళ్యాణము, వేదపండితులచే కంకణాధారణ, హోమము, అన్న దాన కార్యక్రమం జరగనున్నాయన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అమర్నాథ్ రెడ్డి మహా పాదయాత్రను ప్రారంభిస్తారన్నా రు.ఈ కార్యక్రమంలో బోగిడి వారి పల్లి ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, బోగిడివారి పల్లె ఉపసర్పంచ్ యల్లారెడ్డి, రోశిరెడ్డి, మండల యూత్ కన్వీనర్ ఆలం క్రిష్ణ చైతన్య, కుప్పం సుబ్బారెడ్డి, మచ్చా సుబ్బరాయుడు, రామూర్తి నాయుడు, కుమార్ నాయుడు, పి. వెంకటయ్య నాయుడు, ఎన్. వెంకటయ్య నాయుడు, పుత్తా యల్లయ్య, సుబ్రమణ్యం, మాజీ ఉప సర్పంచ్ బీవి సుబ్బయ్య, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

అన్నమయ్య జిల్లా

ప్రధానికి మోకరిల్లడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి

– ప్రధాని గో బ్యాక్ అంటూ సీపీఐ,ఏఐటీయూసీ నిరసన

విశాలాంధ్ర - మదనపల్లె : రాష్ట్ర విభజన హామీలు అమలు మరచి,రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ప్రధానమంత్రి మోడీ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఎందుకు పెద్దపీట వేస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు,జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. 12వ తేదీ అనగా నేడు దేశ ప్రధాని విశాఖ జిల్లా పర్యటన సందర్భంగా సీపీఐ,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మదనపల్లి అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రధాని గో బ్యాక్ అంటూ,విభజన హామీలు అమలు చేయాలని,కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు మోసం చేసిన బిజేపికి పెద్దపీట వేసి మోడీకి ఆహ్వానం పలికేందుకు జన సమీకరణ చేయాల్సిన ఏముందని వారు ప్రశ్నించారు. ఇంతవరకు ప్రత్యేక హెూదా ఇవ్వలేదని,విభజన హామీలు అమలు చేయలేదని,రైల్వే జోన్ ఏర్పాటు చేయలేదని అయినా ప్రధానికి ఎందుకు పెద్ద పీట వేస్తున్నారో సమాధానం చెప్పాలని కోరారు. ఇప్పటి కైనా రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంటు సభ్యులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేయబోమని ప్రధానిచే ప్రకటన చేయించాలని,లేనిపక్షంలో రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్,పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు,ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సురేష్ కుమార్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డప్ప, సహాయ కార్యదర్శి ముబారక్ మదనపల్లి పట్టణ కార్యదర్శి దేవ, అధ్యక్షుడు రవి,గోపాల్,నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఎత్తు, బరువు ఉన్న చిన్నారులపై పర్యవేక్షణ

గర్భిణీలకు హిమోగ్లోబిన్ పరీక్షలు వంద శాతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జిల్లాలోని పలు అంగన్ వాడి కేంద్రాల పరిధిలో ఉండాల్సిన వయస్సుకు తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న చిన్నారులపై పర్యవేక్షణ చేయాలని ఐసిడిఎస్, మహిళా పోలీస్, ఏఎన్ఎం లను జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అంగన్ వాడి కేంద్రాల పర్యవేక్షణ, వయస్సుకు ఉండాల్సిన బరువు కన్న తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న చిన్నారుల పై పర్యవేక్షణ, గర్భిణీ మహిళాలకు హిమోగ్లోబిన్ టెస్ట్, అనిమిక్ పై ప్రత్యేక దృష్టి పలు అంశాలపై ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్ వైజర్లు, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, మెడికల్ ఆఫీసర్లు తదితరులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ప్రతి సచివాలయంలోని అంగన్ వాడి కేంద్ర పరిధిలోని పిల్లల ఎత్తు, బరువు రిపోర్టులు ఖచ్చితంగా ఉండాలని, రిపోర్టు లేకపోతే మాత్రం చర్యలు తీసుకోవడం జరుగుతుందని మహిళా పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. తక్కువగా బరువు, ఎత్తు పెరగకుండా ఉండే పిల్లలు, ఎదుగుదల సరిగలేని పిల్లలకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వారికి బలవర్ధకమైన పౌష్టికాహారం ఇస్తున్నారా లేదా పర్యవేక్షణ చేయాలన్నారు. యాప్ లో ఎత్తు, బరువు సరిగా ఎంట్రీ చేయడం లేదని, ప్రాపర్ గా ఎంట్రీ చేయాలన్నారు. ఈ అంశంపై మహిళా పోలీసులు ర్యాండంగా చెక్ చేయాలి అన్నారు. వంట సరిగా చేయకపోవడం, పౌష్టికాహారం ఇవ్వకపోవడం ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవాలని సిడిపిఓలను కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకొని పనిచేయాలన్నారు. వీటన్నింటిపైన మహిళా పోలీసులు పర్యవేక్షణ చేయాలన్నారు. గర్భిణీ మహిళలకు హిమోగ్లోబిన్ పరీక్షలు వంద శాతం చేయాలని డాక్టర్లకు ఆదేశించారు. సచివాలయం పరిధిలో రక్తహీనత లోపంతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో హిమోగ్లోబిన్ పెంచేందుకు, ఏడు కన్నా తక్కువ ఉన్నవారికి రెగ్యులర్ గా చెక్ అప్ చేయాలని డాక్టర్లను సూచించారు. ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకొని పనిచేయాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఎంహెచ్ ఓ డాక్టర్ కొండయ్య, ఐసిడిఎస్ పిడి నిర్మల, డిపిఎమ్ఓ డాక్టర్ లోకవర్ధన్, రాయచోటి డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డిఎన్ఓ రియా బేగ్, డిస్ట్రిక్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్ బిఎస్ కె డాక్టర్ శేషగిరి, డాక్టర్లు, సిడిపిఓలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

డా.సయ్యద్ అహ్మద్‌కు ప్రాణదాతా సేవా పురస్కారం

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండల కేంద్రం సిద్దారెడ్డిగారి పల్లెకు చెందిన ప్రముఖ సంఘసేవకులు డా. సయ్యద్ అహ్మద్‌కి అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణం నందు రెడ్ డ్రాప్స్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ప్రాణదాత సేవా పురస్కారం గుంతకల్ పట్టణ డీఎస్పీ నరసింగప్ప, మున్సిపల్ ఛైర్పర్సన్ భవాని, మున్సిపల్ కమీషనర్ బండి షేషన్న చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమం గురించి డా.సయ్యద్ అహ్మద్ మాట్లాడుతూ తను మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో, తన తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయిన సయ్యద్ అబూబకర్ సహకారం తో గత 15 ఏళ్ల నుండి ఈ రక్తాదాన కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. ప్రతి ఇంటి నుండి ఒక రక్తదాతను తయారు చేయడమే తన ముందున్న లక్ష్యమన్నారు. ఈ అవార్డుకు తనని ప్రత్యేకంగా ఎన్నుకున్నందుకు రెడ్ డ్రాప్స్ సంస్థ జాతీయ అధ్యక్షులు, టంగుటూరి రెహమాన్ కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులుగా తరిగొండ ఈశ్వరయ్య

విశాలాంధ్ర-వీరబల్లి : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులుగా తరిగొండ ఈశ్వరయ్యను నియమించారు. ఈ నియామకం రాజ్యసభ ఎంపీ కృష్ణయ్య చేతుల మీదుగా రాయచోటి అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా వీరబల్లి మండలం గుఱ్ఱప్ప గారిపల్లె కు చెందిన తరిగొండ ఈశ్వరయ్యని నియమించడం జరిగింది. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ పురోభివృద్ధికి గత 4 దశాబ్దాలుగా కృష్ణయ్య చేస్తున్న అవిశ్రాంత పోరాటంలో నన్ను కూడా భాగం చేసి బాధ్యతలు అప్పగించిన కృష్ణయ్య ,దక్షిణాది రాష్ట్రాల బీసీ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులుకి, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోక్షిత్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కమిటీని బలోపేతం చేసుకుని జిల్లాలో బీసీల సమస్యల సాధనకు కృషి చేస్తానని తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్‌ను కలిసిన విద్యాశాఖ అధికారి

విశాలాంధ్ర-రామాపురం : లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కర్ణపు విశ్వనాథరెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టిన విశ్వనాథరెడ్డిని రామాపురం మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు తన ఉపాధ్యాయ బృందం కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు టీచర్ శివ శంకర్ రెడ్డి రమేష్ పాల్గునరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు.

హఫీజ్‌కు మౌలానా ఆజాద్ పురస్కారం

విశాలాంధ్ర-నందలూరు: పాటూరు తురకపల్లె పాఠశాలలో మౌలానా అబుల్ కలాం జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉర్దూ భాషాభివృద్ధికి కృషిచేస్తున్న పాటూరు తురకపల్లె పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు షేక్. హఫీజుల్లాకు ఎస్టీయు నందలూరు మండలశాఖ ఆధ్వర్యాన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా హఫీజుల్లాను పట్టు శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో అన్నమయ్య జిల్లా ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షులు అల్లం అశోక్ కుమార్ మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి విద్యాశాఖామంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆధ్వర్యంలో అనేక విశ్వవిద్యాలయాలను, ప్రముఖ విద్యాసంస్థలను నెలకొల్పడానికి విశేషకృషి చేశారని, ఆయన ఆశయాలను నెరవేర్చుటకు ఉపాధ్యాయవర్గం కృషిచేయాలని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న హఫీజుల్లా సేవలను పలువురు ఉపాధ్యాయులు కొనియాడి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు నందలూరు మండల అధ్యక్షులు పీ. లీలాకృష్ణయ్య, ఆర్థిక కార్యదర్శి వై.మహేశ్వర బాబు, మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మికాంతమ్మ, కార్యదర్శి సంధాని, నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరాజు, సిగ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

బేస్‌లైన్ వెరిఫికేషన్‌ను పరిశీలించిన ప్రథమ్ కోఆర్డినేటర్

విశాలాంధ్ర- రామాపురం : మండలంలోని బీసీ కాలనీ బి రాచపల్లి రామాపురం మెయిన్ ప్రాథమిక పాఠశాల లను శుక్రవారం అన్నమ య్య జిల్లా ప్రథమ్ ఆర్గనైజే షన్ కోఆర్డినేటర్ రహామత్ అలీ ఖాన్ సంద ర్శించారు. ఈ సందర్భంగా గత నెలలో ఉపాధ్యాయులకు బేస్ లైన్ వెరిఫికేషన్ పై ఇచ్చిన శిక్షణ పై మూడు నాలుగు ఐదు తరగతుల వెనుకబడిన విద్యార్థులకు కామన్ మెథడాలజీ పద్ధతిలో విద్యా బోధనపై అడిగి తెలుసుకున్నారు. బీసీ కాలనీలో సోమ వారం నుండి ప్రారంభిస్తామన్నా రు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలు సుకుని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునుస్వామి, విశ్వనాథ్, రామచంద్ర, వెంకట సుబ్బయ్య, విజయశ్రీ, సుజాత, మునీర్‌ఖాన్ రవీంద్రనాథ్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యావంతులే అసలైన జాతి సంపద : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : సమాజం లో విద్యావంతులే అసలైన జాతి సంపదని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. దేశం గర్విం చదగ్గ విద్యావంత డు స్వతంత్ర సమరయోధులు మేధావి పరిపాలన దక్షుడైన మన దేశ ప్రథమ విద్యాశాఖ మాత్యులు ఓ మహత్తర వ్యక్తి అబుల్ కలామ్ ఆజాద్ 134వ జయంతి సందర్భంగా శుక్రవారం పెనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రగతికి ప్రథమ ప్రాధాన్య ఇస్తూ కుటుంబ ఎదుగుదలకు వ్యక్తిగత వికాసానికి విద్య దోహద పడుతుందన్నారు. విద్యతో వివేకం తోడైతేనే ఉన్నత వ్యక్తిత్వం సిద్ధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, జడ్పీటీసీలు పాలెంకోట రత్నమ్మ (రైల్వేకోడూరు), సుబ్బరాయుడు (పెనగలూరు), ఎమ్మెల్యే పిఎస్ ఎంసి కృష్ణయ్య, మండల విద్యాశాఖ అధికారి జయవేలు, వైసీపీ మండల కన్వీనర్ చక్రపాణి, వీరనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు.

అసమాన విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్

విశాలాంధ్ర-గాలివీడు : స్వతంత్ర సమర యోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి అయిన స్వర్గీయ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసమాన విద్యా వేత్త అని ప్రధానోపా ధ్యాయులు బి.రెడ్డన్న పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆజాద్ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడు తూ స్వీయ అభ్యసనం ద్వారా ఉన్నత విద్య అభ్యసించిన అపార మేధావి,సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్న స్వతంత్ర సమరయోధుడు, పాశ్చాత్య విద్యా వ్యవస్థలో ముఖ్యంగా సైన్స్ మరియు టెక్నాలజీలో బాగా ప్రావీణ్యం పొందిన మహనీయులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఆయన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ టిసి ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర-పీలేరు : ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందించి నట్లు పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక గ్యారేజ్ నందు ఆదర్శ ఉద్యో గులు అభినందన సభఏర్పాటు చేయడమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి చేతులమీదుగా అత్యధిక ఇంధన పొదుపు సాధించినబి.లక్ష్మయ్య 86 లీటర్లు,ఎస్ ఏ .హక్ డ్రైవర్ 74 లీటర్లు డీజిల్ ఆయిల్ పొదుపు చేసినందుకు 500/ మరియు, 300/- నగదు బహుమతి ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు డ్రైవర్ లు వీరిని ఆదర్శంగా తీసుకొని ఇంధన పొదుపు లో అన్నమయ్య జిల్లాలో పీలేరు డిపో ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోగ్యారేజ్ ఇంఛార్జిహరినాథ రెడ్డి గ్యారేజ్ సూపర్వైజర్స్ , మెయింటెనెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు భూములు దళితులకు కేటాయించాలి

విశాలాంధ్ర-నందలూరు : నందలూరు మండలంలోని మిగులు భూములు దళితులకు కేటాయించాలి అని సమతా సైనిక్ దళ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చౌదవరం సుబ్బనరసయ్య అన్నారు. మండపంలో భూమి లేని నిరుపేద దళితులు చాలా మంది ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని దళితుల కోసం అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. మండలం లోని దళితులకు మొదటి ప్రాధాన్యత కలిగిన భూముల కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే దళితుల పక్షపాతిగా ఉన్న పేరును నిలబెట్టుకోవాలని అయన అన్నారు. ఈ అసైన్మెంట్ కమిటీ లో భూముల లేని వారికీ ఇవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నందలూరు మండల అక్షుడు చల్లా సురేంద్ర,, ఉపాధ్యక్షుడు గోదా జంపయ్య, ఆర్గనైజేషన్ సెక్రటరీ శివయ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన తాసిల్దారు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వచ్చే 24 గంటలలో బలపడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తాసిల్దారు బి. రామమోహన్ రెవిన్యూ యంత్రాంగాన్ని మొత్తం అప్రమత్తం చేశారు. బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిచే అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని లోతట్టు ప్రాంతాలను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. వాగులు, వంకలు, చెరువులపై నిఘా ఉంచాలన్నారు. గ్రామ పంచాయితీల పరిధిలోని గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు అందరూ సమన్వయంతో సహకరించి పనిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు అప్డేట్ సమాచారం కార్యాలయాలకు అందించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి : చైర్మన్

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి ఎంత వరకైనా కృషి చేస్తానని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కర్ణపు విశ్వనాథ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ప్రమాణ స్వీకారం అనంతరం బాధ్యతలు చేపట్టారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ అభివృద్ధికి తాను ఎంతవరకైనా పోరాడతానని అన్నారు. ఉదయం 9.30 గంటలకు ఆయన తన కార్యాలయం లో బాధ్యతలు స్వీకరించారు. ఎంతో నమ్మకంతో నాకు ఈ పదవికి సహకరించిన అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రాయచోటి శాసనసభ్యులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు గడికోట మోహన్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ షాజహాన్, మార్కెటింగ్ ఎడి త్యాగరాజు, జడ్పిటిసి మాసన వెంకటరమణ, వైసిపి స్టేట్ వింగ్ జనరల్ సెక్రెటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ శివ, ఆంజనేయులు, మార్కెటింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్యతే ప్రకృతి వ్యవసాయ విధానం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : జీవవైవిధ్యతే ప్రకృతి వ్యవసాయ విధానం చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రమేష్ బాబురావు పేర్కొన్నారు. శుక్రవారం దిన్నేపాడు గ్రామం నర సింహా రాజుగారిపల్లెలో దిన్నెపాటి రవిరాజు పొలంలో మామిడి మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ బాబురావ్ మాట్లాడుతూ జీవవైవిధ్యం ఉండేలా రైతులు పొలాలను దుక్కులు చేసి పెట్టుకోవాలన్నారు. అలాగే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లో పంట సాగు అనంతరం భూసార పరీక్షలు తప్పనిసరి అన్నారు. . ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరి బోర్డ్ మెంబర్ దీన్నేపాటి రవిరాజు, లక్కిరెడ్డిపల్లి మండల మాస్టర్ ట్రేనర్స్ సుబ్బరామయ్య, కాంతమ్మ, సరస్వతి, ఎల్2లు చంద్రమోహన్ రెడ్డి, నాగార్జున, గంగిరెడ్డి, షాహీర్‌బాషా, నాగమణి, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర -రాజంపేట: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పలుకూరి వెంకట రమణ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ సభా భవనంలో హెల్పింగ్ హాండ్స్ 11వ వార్షికోత్సవం సందర్భంగా రాజంపేట మున్సిపాలిటీ లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలు అభినందనీయమన్నారు. వారిని ఆదుకు నేందుకు ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యం లో పేదలను ఆదుకునేందుకు నిరంతర సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో విశ్రాంతి ఎంఈఓ చెంగల్ రెడ్డి,రాధాకృష్ణారెడ్డి,దయానంద, అబ్దుల్ మునాఫ్, జితేంద్ర,సుబ్బారావు,శివ రాజా,చంగయ్య, నరసింహ, చలపతి, విశ్వనాథ్, నందగోపాల్, రవీంద్ర, చలపతి, రంగస్వామి, హరికృష్ణ రాజు పాల్గొన్నారు.

బిందు సేద్యంపై రైతులకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - రామసముద్రం : బిందు సేద్యంపై అన్ని రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ సీహెచ్ రామచంద్రారెడ్డి,పీఏసీఎస్ ఛైర్మన్ కేశవ రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం రామసముద్రం మండల వ్యవసాయ కార్యాలయం నందు మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సీహెచ్ రామచంద్రారెడ్డి,పీఏసీఎస్ ఛైర్మన్ కేశవ రెడ్డిలు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు సబ్సిడీపై ఇవ్వాలన్నారు. ఆర్బీకేల నందు పురుగుమందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్, భాస్కర్ గౌడ్, రమణారెడ్డి,రాధారెడ్డి, నందకుమార్‌రెడ్డి,ప్రకాష్ రెడ్డి,సర్పంచ్ రమణ రమణారెడ్డి,శ్రీవిద్య పాల్గొన్నారు.

మోదీ గో బ్యాక్ .. వామపక్ష పార్టీల వినూత్న నిరసన

విశాలాంధ్ర - రాజంపేట: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ సిపిఐ, సిపిఎం, ఎస్ ఎఫ్ ఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మూకుడులు చేత బట్టి వినూత్నంగా నిరసన తెలియజేశారు. మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేసి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రానికి వస్తున్నా రని విమర్శించారు. నరేంద్ర మోదీ దేశాన్ని అంబానీ, అధానీలకు తాకట్టు పెట్టారని అన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, ఉప్పు, పప్పు తో సహా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటి సామాన్యుడికి అందని ద్రాక్షలా మారాయని., దేశాన్ని ఇంత సంక్షోభంలోకి నెట్టేసిన ఘనత మోడీకే దక్కుతుందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కానీ, ప్రత్యేక ప్యాకేజీ కానీ ప్రకటిం చకుండా నూతనంగా ఏర్పాటైన ఆంధ్ర రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం అనాధను చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఏరియా కార్యదర్శి చిట్వేలి రవికుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఎస్ రాయుడు, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, సహాయ కార్యదర్శి రమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శివరామకృష్ణదేవరా, ఆటో యూనియన్ జిల్లా నాయకులు నాగేశ్వర యాదవ్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఈ.సికిందర్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో: భారతదేశ ద్రోహి నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య ఆగ్రహ వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శుక్రవారం ఉదయం సిపిఐ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి టోల్గేట్ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడు తూ మోడీ అధికారం చేపట్టి 8 ఏళ్లు దాటిన విభజన హామీలను పరిష్కరించలేదని విమర్శిం చారు. ప్రధాని ఏమీ వరగబెట్టడానికి విశాఖ కు వస్తున్నారని ప్రశ్నిం చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కేశం ప్రసాద్, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి గంగాపూరి సుధాకర్, సిపిఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, కనుపర్తి రాజేంద్ర, మహిళలు తదితరులు పాల్గొని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఓబులవారిపల్లి, పుల్లంపేట, పెనగలూరు మండలాలలో కూడ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

గో బ్యాక్ నరేంద్ర మోడీ : సీపీఐ

విశాలాంధ్ర- చిట్వేలి : చిట్వేలు మండలంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు కేశం ప్రసా దు. సామా గంగయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చిట్వేల్ మండల కార్య దర్శి తిప్పన ప్రసాద్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు అడుగడుగునా మోసం. ద్రోహం చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి వైసీపీ ప్రభుత్వం కొంగు కాయడం దారుణమన్నారు. విశాఖ పర్యటన కోసం ప్రధాని నరేంద్ర మోడీ రావడం అనేది సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆటో యూనియన్ నాయకులు లక్ష్మీ నరసయ్య, గిరిబాబు, కిరణ్, నరసింహ, పెంచలయ్య, కృష్ణార్జున, మధు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా దినోత్సవంపై మిట్స్ విద్యార్థులకు పోటీలు

విశాలాంధ్ర - కురబలకోట : కురబలకోట మండలం, అంగళ్లు వద్ద గల మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ మిట్స్ కళాశాల నందు ఎన్.ఎస్.ఎస్ విభాగం వారు జాతీయ విద్యా దినోత్స వాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు జాతీయ విద్యా దినోత్సవం పై విద్యార్థులకు పోటీ లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమాల్ బాషా మాట్లాడుతూ విద్యలేని వాడు వింతపశువే అనే సూక్తి అందరికీ తెలిసిందేనని,విద్యతోనే మనిషి అభివృద్ధి చెందుతాడన్నారు. ప్రతి సంవత్సరం భారత్ వ్యాప్తంగా నవంబర్ 11వ తేదీన జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారు. మొదటి విద్యా మంత్రి మౌలానా అబు ల్ కలాం ఆజాద్‌కు గుర్తుగా ఈ దినోత్సవాన్ని ప్రతి ఏడాది ఘనంగా జరుపుకుంటారన్నారు. దేశంలో ఆధునిక విద్యా విధానాన్ని తీసుకురావడానికి కలాం తనవంతు కృషి చేశారని,భారత జాతీయ విద్యా విధానంలో ఎన్నో సేవలందించారని కొనియాడారు. ఈ కార్యాక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ తులసీ రామ్ నాయుడు, కళాశాల ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ రాజేష్ , విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ఆర్టీసీ బస్సు ప్రారంభం

విశాలాంధ్ర - రామసముద్రం : మండలంలోని అనప్పల్లె నుండి నూతన ఆర్టిసి బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. వైస్ ఎంపీపీ వెంకట రమణా రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు కేశవరెడ్డి,మండల వైకాపా కన్వీనర్ భాస్కర్ గౌడ్,ఎంపీటీసీ పద్మ,సర్పంచ్ ఉదయ్ శంకర్ రెడ్డిలు బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యం కోసం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కృషితో ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ ఆదినారాయణ, రెడ్డెప్ప నాయుడు,ఈశ్వర్,నందకుమార్ రెడ్డి,రాధారెడ్డి, కత్తి వాలెప్ప,దొడ్డిపల్లి ఆనంద్,డాక్టర్ ప్రకాష్,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు చేసిన సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శం: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఆధునికకవి, తత్వవేత్త, సంగీత కారుడు, స్వరకర్త కనకదాసు సమాజానికి అందించిన సేవలు ఎనలేనివని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ కొనియాడారు. శుక్రవారం కనకదాసు జయంతి సందర్భంగా కలెక్టరేట్లో కలెక్టర్ గిరీష పిఎస్ కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు చెందిన శ్రీ కనకదాస 1905-1609 కాలంలో జీవించిన గొప్ప భక్తుడు ఆధునిక కవి, తత్వవేత్త, సంగీత కారుడు, స్వరకర్త కనకదాసు ఆనాడు సమాజానికి అందించిన సేవలు ఎనలేనివన్నారు. అప్పట్లో కనకదాసు వెనుకబడిన కులాల వారి సంక్షేమం కోసం అత్యంత ప్రాధాన్యత నిచ్చిన గొప్ప మహానుభావుడన్నారు. వెనుకబడిన కులాల వారు అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లేందుకు తమ సామాజిక బాధ్యతగా ఎనలేని కృషి చేశారన్నారు. కురుబ కులాల జీవనోపాధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అప్పట్లో ఇతర హరిదాసుల్లాగే ఈయన కీర్తనల్లో సాధారణ కన్నడ భాషను ఉపయోగించేవాడని ఇంతటి గొప్ప ఆధునిక కవి శ్రీ కనకదాసు ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో బాలకృష్ణ, బిసి సంక్షేమ శాఖ అధికారి సందప్ప, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని భూహక్కు పత్రాలు సిద్ధం చేయండి: జేసీ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండలంలో నిర్దేశించిన ప్రాంతాలలో తప్పులు లేని భూ హక్కు పత్రాలు సిద్ధం చేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం సమగ్ర సర్వే కార్యాచరణ అమలు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా రీ సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి భూ హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమగ్ర సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా త్వరలోనే భూ హక్కు పత్రాలను పంపిణీ చేసే అవకాశం ఉందన్నారు.నిర్లక్ష్యం చేయకుండా పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు.భూ హక్కు పత్రాలలో ఎటువంటి తప్పులు లేకుండా జాబితా సిద్ధం చేయాలన్నారు. తాసిల్దారు బి రామమోహన్, డిప్యూటీ తాసిల్దారు డి అమరేశ్వరి, మండల సర్వేయర్ సుదర్శన్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు మానస, హేమంత్, పంచాయితీ సెక్రటరీలు, విలేజ్ సర్వేయర్లు, విఆర్ఓలు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ప్రభుత్వ బిటి కళాశాలలో అధ్యాపకులను నియమించాలి: ఏఐఎస్ఎఫ్



విశాలాంధ్ర - మదనపల్లె : ప్రభుత్వ బిటి కళాశాలలో వెంటనే అధ్యాపకులను నియమించాలని, ఏఐఎస్ఎఫ్ బిటి కళాశాల సమితి ఆధ్వర్యంలో కళాశాల ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు నవీన్ మాట్లాడుతూ బిటి కళాశాల బిసెంట్ ట్రస్టు,కళాశాల యాజమాన్యం ఆర్థిక అరాచకాల వల్ల కళాశాల దయనియ్యమైన పరిస్థితికి చేరుకున్న నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అధ్యాపకులను నియమించి విద్యార్థులకు మెరుగైన వైద్య దొరుకుతుందని ఏఐఎస్ఎఫ్, కళాశాల విద్యార్థులు,పూర్వ విద్యార్థులు పోరాట ఫలితంగా బిటిసిని ప్రభుత్వ కళాశాలగా సాధించుకున్నామని,కళాశాల ప్రభుత్వపరమైన తర్వాత కూడా తాత్కాలిక అధ్యాపకులతోనే కళాశాలను నడిపితే విద్యార్థులు ఒక్కరు కూడా డిగ్రీలు పూర్తి చేయలేరన్నారు.కళాశాల పూర్వ కరస్పాండెంట్ గారు తాత్కాలిక అధ్యాపకుల వద్ద డబ్బులు వసూలు చేసి నియమించారని,వారి ఉద్యోగ బాధ్రత కోసం కొత్తగా కళాశాలకు వచ్చిన ప్రభుత్వ ప్రిన్సిపాల్స్ తన చెప్పుచేతుల్లో పెట్టుకొని ప్రభుత్వ అధ్యాపకులను రానివ్వకుండా అడ్డుపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయన్నారు.ఇప్పటి వరకు కళాశాలలో సరైన అధ్యాపకులు లేక విద్యార్థులు 90 శాతానికిపైగా ఫేయిలయ్యారని,ఇకమీదట కూడా ప్రభుత్వ అధ్యాపకులు రాకపోతే విద్యార్థులు మరింత నష్ట పోతారన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిటి కళాశాలకు ప్రభుత్వ అధ్యాపకులను నియమించాలని లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రమ్మయ్య,కోశాధికారి మాధవ్ మరియు కళాశాల విద్యార్థులు రఫీ,విజయ్, పవన్,వినయ్ రాజేష్,కమలాకర్ దినేష్,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వాతావరణంలో అంబళం పూజ
- అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన పూజా ప్రాంగణం

విశాలాంధ్ర - మదనపల్లె రూరల్ : అన్నమయ్య జిల్లా,మదనపల్లి పట్టణం,బసినికొండ శివాలయం, అగ్గిపుల్లల ఫ్యాక్టరీ వద్ద గురువారం రాత్రి అయ్యప్ప స్వామి అంబళం పూజ అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక పండుగ వాతావరణంలో నిర్వహించారు.కులదీప్ స్వామి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో,అయ్యప్ప స్వామి ఆలయం ప్రధాన గురుస్వామి రమణ రావు స్వామి పర్యవేక్షణలో అంబళం పూజ ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా రమణారావు స్వామి మాట్లాడుతూ అయ్యప్ప మండల దీక్ష ఎంతో పవిత్రమైనదన్నారు. అయ్యప్ప మాలదారులు ఎక్కడైనా అంబళం పూజ నిర్వహిస్తే అందులో పాల్గొనడం ద్వారా ఎంతో పుణ్యం లభిస్తుందన్నారు.ముఖ్యంగా బసినికొండ శివాలయం వద్ద ఏర్పాటు చేసిన పూజలో 18 కళశములను ఏర్పాటు చేయడం అద్భుతంగా ఉందన్నారు. ఈ పూజలో పాల్గొని బిక్ష చేస్తే పాపాలు హరించి,సకల శుభాలు కలుగుతాయన్నారు.అనంతరం కుల్ దీప్ స్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి అంటే తనకు తన కుటుంబానికి అపారమైన భక్తి విశ్వాసాలు ఉన్నాయన్నారు. అయ్యప్ప స్వామి అనుగ్రహంతో తమకు అన్ని శుభాలు కలుగుతున్నాయన్నారు. అయ్యప్ప చల్లని ఆశీస్సులతో అంబళం పూజను జరుపుకోవడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు.ఈ పూజకు పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలదారులు,భక్తులు,పుర ప్రజలు విచ్చేయడం ఆనందంగా ఉందన్నారు.వీరందరికీ పంచామృతం, తీర్థ ప్రసాదాలు,అన్న ప్రసాదాలను అందజేయడం జరిగిందన్నారు.అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలదారులు, బసినికొండ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పీలేరు: నేడు జాతీయ లోక్ అదాలత్ ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 11వ అదనపు జిల్లా జడ్జి ఎస్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాటలాడుతు పీలేరు కోర్టు ఆవరణంలోనేడు రెండవ శనివారం కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఎక్కువ రాజీకి పోదగ్గ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ లో త్వరితగతిన కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ జాతీయ లోకదాలతో మోటారు వాహన కేసులు, సివిల్ కేసులు క్రిమినల్ కేసులు బ్యాంకు కేసులు కుటుంబ తగాదాల కేసులు ఈ జాతీయ లోకదాలతో పరిష్కార దిశగా ప్రజలు సహకరించాలని ఉదయం 10:30 నుండి సాయంత్రం వరకు కేసులు పరిష్కారం చేస్తామని దీనికి సంబంధించిన రెండు బెంచులను వేసామని మొదటి బెంచ్ లో జడ్జ్ శ్రీనివాసరావు అదనపు జిల్లా జడ్జి కేసులు పరిష్కారం చేస్తారు మోటర్ వాహన కేసులు, సివిల్ కేసులు, బ్యాంక్ కేసులు, పి ఎల్ సి కేసులు నిర్వహించబడుతాయి. రెండవ బెంచ్ లోగాయత్రి అదనపు జూనియర్ సివిల్ జడ్జి క్రిమినల్ కేసులు సివిల్ కేసులు పరిష్కారం చేస్తారు. రేపు జరిగే జాతీయ లోక్ అదాలత్ లో పీలేరు కోర్టు న్యాయవాదులు మరియు ఇన్సూరెన్స్ అధికారులు పోలీసు అధికారులు బ్యాంక్ అధికారులు, కక్షిదారులు ప్రతి ఒక్కరూ ఈ జాతీయ లోక్ అదాలత్ ను సహా సహకరించాలని తెలియజేశారు

వాల్మీకి ముదిరాజ్ ఐక్యవేదిక కోసం కలిసికట్టుగా నడుద్దాం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : వాల్మీకి ముదిరాజ్ ఐక్యవేదిక కోసం అందరము కలిసికట్టుగా నడవాలని కర్నూల్ జోన్ హెూంగార్డు ఎస్పీ మహేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం దేవలంపల్లి చెన్నకేశవ స్వామి ఆలయంలో వాల్మీకి ముదిరాజ్ ఐక్యవేదిక కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులు తమ పిల్లలను మంచి విద్యావంతులు చేయాలని ఆయన సూచించారు. ముందుగా మానవత విలువలను పిల్లలకు నేర్పించాలని వాల్మీకి ముదిరాజ్ పిల్లలను గొప్ప చదువులు చదివించాలన్నారు. సమాజంలో వాల్మీకి ముదిరాజ్ కులాలు అట్టడుగులు ఉన్నాయని ముదిరాజ్ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. రాజకీయాలకతీతంగా కులాలకు అతీతంగా స్వాతంత్రంగా సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి వాల్మీకి ముదిరాజ్ ఆధ్వర్యంలో వన భోజన మహెూచన కార్యక్రమం నిర్వహించి చెన్నకేశవ స్వామికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ వరప్రసాద్, అన్నమయ్య కడప జిల్లా నుంచి వాల్మీకి ముదిరాజ్ సంఘం నాయకులు రామచంద్రయ్య, మండల రామాంజనేయులు, విజయభాస్కర్, రాజేంద్ర బాబు, మూగి వెంకటరమణ, వాల్మీకి, సేవాదళ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు మూగి రెడ్డప్ప, విఆర్‌పిఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గువ్వల యోగానంద బాబు, రామసముద్రం దొడ్డిపల్లి సర్పంచ్ ఆనంద్, మానవ హక్కుల జిల్లా అవగాహన సదస్సు అధ్యక్షులు చలపతి కొర్లకుంట కృష్ణయ్య, సర్పంచు కేశవయ్య, శ్రీరాములు, రాజేష్, డిబీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యకు మార్గదర్శి మౌలానా అబుల్ కలాం ఆజాద్:శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:దేశంలో గుణాత్మక విద్యకు మార్గదర్శిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మైనారిటీ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆల్మేవ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం మరియు మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షులు జుబేర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో రాయచోటి మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలని పరితపించిన మహెూన్నత వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని తెలిపారు.దేశానికి, విద్యారంగానికి వారు అందించిన సేవలు మరువలేనివన్నారు.ఆ మహెూన్నత వ్యక్తి జన్మదినాన మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని జరుపుటకు 2008 లో మహానేత వైఎస్ఆర్ నిర్ణయం తీసుకుని అమలుకు చర్యలు తీసుకున్నారన్నారు.మహిళలకు రక్షణగా జగన్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళలకు అన్ని చోట్ల గౌరవం దక్కాలని, అలాంటి సంస్కారాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. దిశ యాప్ ద్వారా ఈవ్ టీజింగ్ బాగా తగ్గిందన్నారు.అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో మైనారిటీ భవన్ , ఉర్దూ పీజీ కళాశాల , వరిగ రహదారిలో ఏర్పాటవుచున్న పి జి కేంద్రాన్ని భవిష్యత్ లో యూనివర్సిటీగా అభివృద్ధి చేయడం జరుగుతుందని , పట్టణంలో షాది ఖానా మరియు మౌలానా ఆజాద్ కూడలి ఏర్పాటు చేయడం జరుగుతుందని శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు. విద్య వైద్య ఉపాధ్యాయ సంక్షేమ రంగాల్లో విశేషంగా కృషి చేసిన ప్రముఖులకు సన్మానాలు,ఎస్ఎస్సి నుండి పీహెచ్డీ వరకు అగ్రగామిగా నిలిచిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు మెమెంటోలు ఇచ్చి ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సంస్కర్తలు అబ్దుల్ హక్ , మునిసిపల్ వైస్ చైర్మన్ ఫయాజ్ ,బేపారి మహమ్మద్ ఖాన్,అన్నా సలీం,ఆల్మేవ ప్రధాన కార్యదర్శి అసదుల్లా , యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జాబీర్, రూటా నాయకులు ముహమ్మద్ అలీ , పీయస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎండి జక్రియా బాషా, రాయచోటి అధ్యక్షులు హబీబుర్రహ్మాన్, యస్ టి యు కార్యదర్శి అంజద్ బాష , మహిళా కాళాశాల ప్రిన్సిపల్ , మల్లూరు సర్పంచ్ దేవపట్ల నజీర్ బాషా,లెక్షరర్ సూర్యనారాయణ రెడ్డి తదితర విద్యా వైద్య ఆరోగ్య సంక్షేమ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి
- అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి మున్సిపాలిటీ రాయుడు కాలనీలో అంగన్ వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. పిల్లల ఎత్తులు, బరువులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. తక్కువ బరువు ఉన్న చిన్నారులను గుర్తించి అదనపు పోషకాహారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ప్రతి రోజూ భోజనం, పాలు, గుడ్లు తదితర బలవర్ధకమైన ఆహారాన్ని నాణ్యతతో అందించాలన్నారు. పౌష్టికాహారం భుజించడం ద్వారా రక్తహీనత లోపాలు రావని కలెక్టర్ తెలిపారు. అంగన్ వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులలో పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులను నిరంతరం పర్యవేక్షించాలని అంగన్ వాడి సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో ఐసిడిఎస్ పిడి నిర్మల, సిడిపిఓ, అంగన్ వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

దేశ విద్యాభివృద్ధిలో అబుల్ కలాం సేవలు అమోఘం
- ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి కితాబు

విశాలాంధ్ర - మదనపల్లె : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణ మూర్తి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వంలో స్వాతంత్ర పోరాట యోధుడు మరియు దేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి విద్యా వ్యవస్థకు ఒక రూపాన్ని ఇవ్వటమే కాకుండా యుజిసి,ఏఐసిటిఈ మరియు స్కూల్ సెకండరీ బోర్డు వంటి వ్యవస్థలను రూపు కల్పన చేశారని కొనియాడారు.విద్యావ్యవస్థలో అనేక మార్పులు చేర్పులు చేసి,పాఠశాలలు, కళాశాలలు,విశ్వవిద్యాలయాల్లో ఆధునిక విద్యా విధానాన్ని జోడించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అదేవిధంగా నూతన విద్యా విధానంలో జాతీయ విద్యా విధానాన్ని ఏపీ ప్రభుత్వం చేపట్టి తదనుగుణంగా నాడు - నేడు ద్వారా విద్యా వ్యవస్థలో అన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తోందన్నారు.అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సేగు రెడ్డెప్ప రెడ్డి మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ సేవలు,చరిత్ర గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ఆయన జీవితం నేటి యువతరానికి ఆదర్శమని,ఆయన అడుగుజాడల్లో మనమంతా నడిచి దేశ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు.ముందుగా అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకురాలు శివ పార్వతి దేవి, అధ్యాపకులు గంగయ్య,రమణ,మాలతి మరియు అధ్యాపకేతర సిబ్బంది శేషయ్య,శేఖర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

సుఖవ్యాధులు - నివారణ చర్యలు
హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య

విశాలాంధ్ర-పీలేరు : చెప్పుకోవడానికి ఇష్టపడని, సుఖ వ్యాధులకు మేలైన చికిత్సతో నివారణ సులభమని,హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య అన్నారు. తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం గాండ్లపల్లి గ్రామములో సుఖవ్యాధులు - నివారణ చర్యలు అంశముపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రత లోపము మరియు సురక్షితం కాని లైంగిక చర్యల ద్వారా వ్యాప్తిచెందే, గనేరియా, సిఫిలిస్,మొదలైన సుఖవ్యాధుల నిర్మూలనకు అవగాహన కలిగి సత్వర చికిత్స తో. వ్యాధుల నిర్మూల సాధ్యమని, లేనిచో సుఖ వ్యాధులు, వీరి సంతతిపై తీవ్ర చెడు ప్రభావం చూపుతుందని,రక్తపరీక్షలతో నిర్ధారించే సుఖ వ్యాదుల వల్ల,వంధత్వం,శిశువ ుముందుగా జన్మించడం, అంగవైకల్యముతో మరియు తక్కువ బరువుతో పుట్టడం,పొత్తికడుపులో నొప్పి, స్రావాలు,జ్వరం,జననేంద్రియాల్లో దురద, మూత్రవిసర్జనలో మంట, నొప్పి,కీళ్ల వాపులు, మానసిక,శారీరక ,లక్షణాలతో సుఖవ్యాధి గ్రస్తులు బాధపడ్తారని,ఇలాంటి వారుదంపతులు ఇద్దరు చికిత్స సరియగు సమయానికి వైద్యులను సంప్రదిస్తే సులభ నివారణ సాధ్యమని, ముఖ్యంగా జననేంద్రియా స్వీయ పరీక్షలు చేసుకునే అవగాహణలోపం వల్ల,వ్యాధిని తొలిదశలో గుర్తించే అవగాహన లోపం వల్ల ఈ వ్యాదులు పూర్తి నిర్మూలన దశకు చేరుకోవడం లేదని, ఒక్కోసారి వ్యాధి లక్షణాల కనిపించక పోవచ్చు కాని శరీరములో వ్యాధి కొన్ని నెలల వరకు ఉండి మరింత ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని,కొండయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పి.హెచ్.ఎన్. వెంకటసుబ్బమ్మ ,పర్యవేక్షకులు కృష్ణయ్య,ఏ.యన్.యం.నాగవేణి,ఆశా, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధి,సమస్యలు,సంక్షేమ పథకాలపై సమీక్ష
- 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షబానా వెల్లడి



విశాలాంధ్ర - మదనపల్లె : వర్ష కాలంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో వుంచుకొని ఫ్రైడేని,డ్రైడేగా కొన సాగించాలని మదనపల్లి పట్టణం 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షబానా మరియు వైయస్సార్‌సీపీ జిల్లా యూత్ సెక్రెటరీ ఎస్.ఏ. కరీముల్లాలు తెలిపారు.శుక్రవారం ఈ విషయంపై వార్డులో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం కావడం వల్ల ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇళ్లలో నీటి తొట్టెలలోన ఎక్కువ రోజులు నీటి నిలువ ఉంచకుండా శుక్రవారం రోజు వాటిని తొలగించి ఆరబెట్టుకోవాలని తెలిపారు.అదేవిధంగా ఇంటి పరిసరాలలోనూ మిద్దిపైన అటకలలోను వర్షపునీరు నిలువ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది.నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండిన చోట దోమలు వ్యాప్తి చెంది మలేరియా,టైఫాయిడ్, డెంగుతో పాటు వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందని ప్రజలకు సూచించారు.అదేవిధంగా వార్డు సచివాలయంలో గత నెల మరియు వారం రోజులు వ్యవధిలో జరిగిన వార్డు అభివృద్ధి,ప్రజల నుండి అందిన సమస్యలు,వాటి పరిష్కారంలో పురోగతి, సంక్షేమ పథకాలు అమలుపై సమీక్షా నిర్వహించడం జరిగింది. అంతేకాకుండా నవరత్నాలు ను అర్హులైన వార్డు ప్రజలకు అందే విధంగా చూడాలని అందకుంటే కారణాలను వారికి తెలపాలన్నారు.వార్డు ప్రజలకు అందుబాటులో వుంటూ,సమస్యలపై వెంటనే స్పందిస్తూ ప్రభుత్వానికి,ప్రజలకు వారధిగా సేవలు అందించాలని కోరారు.

స్వామిత్ర సర్వేను పారదర్శకంగా చేపట్టండి:తహశీల్దార్



విశాలాంధ్ర-పీలేరు : స్వామిత్ర సర్వేను పారదర్శకంగా చేపట్టాలని పీలేరు వీఆర్వోలను తహసిల్దార్ రవి ఆదేశించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో తాసిల్దార్ రవి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వామిత్ర కార్యక్రమం అంటే గ్రామాలలో గ్రామ కంఠం భూములకు యాజమాన్యపు హక్కు కల్పించడమే అని అన్నారు. ఒక గ్రామంలో గ్రామ కంఠం భూమి సరిహద్దులను గుర్తించి ఆ భూమిపై అనుభవం ఉన్నవారికి యాజమాన్యపు హక్కును కల్పించే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఎలాంటి అభ్యంతరాలు లేని గ్రామకంఠం భూములకు యాజమాన్యపు హక్కులను కల్పిస్తామన్నారు. అభ్యంతరాలు ఉన్న వాటికి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, తహసిల్దారు, ఆర్డీవో స్థాయిలో అంచలంచలుగా విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించి యాజమాన్యం హక్కును కల్పించే ఏర్పాట్లు జరుగుతాయన్నారు. తద్వారా ప్రతి గ్రామంలోనూ గ్రామకంఠం భూములకు యాజమాన్యపు స్వేచ్ఛ లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు.

పుస్తకాలు ప్రియనేస్తాలు: పట్టణ సిఐ

విశాలాంధ్ర -రాజంపేట: పుస్తకాలు ప్రియ నేస్తాలని, పుస్తకాలను చదవడం ద్వారా ప్రపంచ జ్ఞానం లభిస్తుందని పట్టణ సిఐ నరసింహారావు, ఎస్సై లక్ష్మీప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం విశాలాంధ్ర బుక్ హౌస్ వ్యాన్ సిబ్బంది ఆధ్వర్యంలో విశాలాంధ్ర సంచార వాహనాన్ని సిఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడ లభించని పుస్తకాలు విశాలాంధ్ర బుక్ హౌస్ వ్యాన్ లో లభిస్తాయన్నారు. పుస్తకాలను చదవడం ద్వారా మానసిక వికాసం ఏర్పడుతుందన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ విజ్ఞానానికి నిలయమన్నారు. తెలుగు సాహితి వైతాళికులైన కందుకూరి, గురుజాడ, గిడుగు రామ్మూర్తి, సాహిత్యాన్ని విశాలాంధ్ర వెలుగులోకి తెచ్చిందన్నారు. విశాలాంధ్ర పబ్లికేషన్స్ ప్రచురించిన అనేక సాహిత్య గ్రంథాలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు పురస్కరించుకొని 1 నవంబర్ 2022న మంగళవారం ఉదయం ఏ-కన్వెన్షన్ సెంటర్, విజయవాడ లో వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ నగదు పురస్కారంతో పాటు మెమొంటో, ప్రశంసాపత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతులమీదుగా అందుకోవడం సంతోషకరమన్నారు. అందుబాటులోకి వచ్చిన విశాలాంధ్ర బుక్ హౌస్ ను విద్యార్థులు, విద్యావంతులు, మేధావులు, పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశాలాంధ్ర బుక్ హౌస్ వ్యాన్ ఇన్చార్జి కె వెంకటాద్రి మాట్లాడుతూ విశాలాంధ్ర ప్రచురణాలయం 1953 జనవరి 1న ఆవిర్భవించిందన్నారు.నాటి నుండి 69 సంవత్సరాలుగా అభ్యుదయ వామపక్ష సామాజిక శక్తుల సంఘటిత పోరాటాలకు విశాలాంధ్ర వెన్ను దన్నుగా నిలుస్తూ మరోవైపు తెలుగు సాహిత్య, సాంస్కృతిక వికాసానికి సోషలిస్టు తాత్విక సాహిత్య భావాల ప్రచారానికి నిర్విరామంగా కృషి కొనసాస్తుందన్నారు. తెలుగు సాహిత్యంతో పాటు ఇంగ్లీష్ గ్రామర్, పర్సనాలిటీ డెవలప్మెంట్, సైకాలజీ, సైన్స్ పుస్తకాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు,నవలలు, కథలు పుస్తకాలు మరియు చిన్న పిల్లలకు సంబంధించిన పుస్తకాలు లభిస్తాయన్నారు.3 రోజుల పాటు రాజంపేట పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బి బంగ్లా వద్ద విశాలాంధ్ర సంచార వాహనం స్థానికులకు అందుబాటులో ఉంటుందన్నారు. విద్యావంతులు, మేధావులు, ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్విని చేసుకున్నారు. విశాలాంధ్ర సంచార వాహన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్ టి యు నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, సిపిఐ నాయకులు మహేష్, ఎమ్మెస్ రాయుడు, సికిందర్, శివరామకృష్ణదేవరా, రవికుమార్, విశాలాంధ్ర బుక్ హౌస్ స్టాఫ్ శంకరయ్య, సుధాకర్,సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

గో బ్యాక్ నరేంద్ర మోడీ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి ఆంధ్ర రాష్ట్రాన్ని మోసం చేసి, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకుండా విభజన హామీలు అమలు చేయకుండా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ చేతుల్లో అప్పజెప్పుతు ఈరోజు విశాఖపట్నంకి వస్తున్న నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ శుక్రవారం బంగ్లా సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి పట్ల నరేంద్ర మోడీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన రాష్ట్ర ప్రత్యేక హెూదా విభజన హామీలు అమలు జరుపుతామని విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని విశాఖ పర్యటనలో మోడీ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన ఎనిమిదిన్నర ఏళ్లలో ఏపీకి ఇచ్చిన విభజన హామీలు ఒక్కటి కూడా అమలు జరపలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు వెనుకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ అభివృద్ధికి ప్యాకేజీ గంగవరం పోర్టు కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి రెవెన్యూ లోటుకు నిధులు విశాఖ రైల్వే జోన్ దేనికి నిధులు ఇవ్వని నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటనకు రావడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా నాయకురాలు మరి సుమిత్ర, సిపిఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు బి వెంకటేష్, పోలూరు అశోక్, బీసీ ఆంజనేయులు యపరాల్ల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

యూనియన్ బ్యాంక్ 104 వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-మదనపల్లి: యూనియన్ బ్యాంక్ 104 వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం మదనపల్లి బ్యాంక్ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు నందు ఖాతాదారులకు ఉత్తమమైన సేవలు అందించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అలాగే వ్యాపారవేత్తలు స్వయం సహాయక సంఘాలకు బంగారు నగలపై, గృహాలపై, వాహనాలపై సకాలంలో రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రత్యేకించి రైతులకు వ్యవసాయ సంబంధింత రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. రైతులకు చిన్న వ్యాపారస్తులకు సిటిజనులకు ప్రత్యేకించి రుణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచబెట్టారు ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ మేనేజర్ షణ్ముఖంరావు సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రతి ఒక్కరూ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు, నియోజకవర్గ టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు తెలియజేశారు. మండలపరిధిలోని దిగువ అబ్బవరం పంచాయితీ ఇందుకూరుపల్లె లోని రామాలయం నందు ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం గ్రామస్తులు నిర్వహించిన సీతారాముల కల్యాణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి అయన స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద్ బాబు మాట్లాడుతూ నిత్యం భగవంతుని స్మరించడం వలన మంచి ఆలోచనా విధానాలు సిద్ధిస్తాయని,మనసు కు ప్రశాంతత లభిస్తుందన్నారు. పురాణ గ్రంథాలు గురించి తెలుసుకోవడం వలన మంచి నడవడిక సాధ్యమవుతుందన్నారు. అనంతరం ఆయనను గ్రామస్తులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బయ్య నాయుడు,శ్రీనివాసులు నాయుడు, ఆదినారాయణ,వెంకటరమణ, మేస్త్రిరమణ, సురేష్, గోపాల్, నగేష్, ప్రసాద్,హరి, అంజి, బాలాజీ, జగదీష్, యమయ్య, పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



విశాలాంధ్ర - సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె మడితాడు జిల్లా మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు సుబ్బరాయుడు మాట్లాడుతూ అబుల్ కలాం భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా.. భారతప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ పనిచేశారు. అనంతరం కాంప్లెక్స్ జాయింట్ సెక్రటరీ, ఎస్టీయు మండల అధ్యక్షులు ఆరిఫుల్లా మాట్లాడుతూ ఆయన విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన తొలి ఐదేళ్ల కాలంలోనే యుజీసీ, ఐసీసీఆర్, ఏఐసీటీయు, సీఐఎస్ఆర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో పాటు ఖరగ్‌పూర్‌లో సాంకేతిక విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ జాయింట్ సెక్రటరీ ఆరిఫుల్లా, ఉపాధ్యా యులు అబ్దుల్ అజీస్, రాజేశ్, ఖాదీరుల్లా, కౌసర్బాషా, ఓబులమ్మ, అమీరున్నీసా, లియాఖాత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వెల్లువెత్తిన అభినందనలు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : దేశం గర్వించదగ్గ విద్యావంతుడు స్వతంత్ర సమరయోధులు మేధావి పరిపాలన అధ్యక్షుడు మన దేశ ప్రథమ విద్యాశాఖ మాత్యులు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 134వ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని గవర్నమెంట్ హైస్కూల్ లో పనిచేస్తున్న మైనార్టీ ఉపాధ్యాయులు వెపరాల ఎబెనెజర్ ను, కరీముల్లా ను భాధ్య ప్రధానోపాధ్యాయుడు చెంగల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం శుక్రవారం పిల్లల సమక్షంలో ఘనంగా అభినందించారు. పిల్లలు చప్పట్లతో అభినందనలు తెలిపారు. మాస్టర్ వెపరాల ఎబినెజర్ తన సొంత ఖర్చులతో మైనార్టీ హిందీ ఉపాధ్యాయుడు కరీముల్లా కు ఎబెనెజర్ చిరు బహుమానం అందించి సత్కరించి అభినందించారు. పిల్లల్లో సంతోషం వెల్లివిరిసింది.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-చిట్వేలి : 55వ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథ పాలకులు శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 14వ తేదీ సోమవారం నుండి 20వ తేదీ ఆదివారము వరకు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. 14వ తేదీన బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు 15నతేదీన పుస్తక ప్రదర్శన 16న గ్రంథాలయ ఉద్యమ కారులకు నివాళులు 17న హై స్కూల్ నందు సీనియర్ జూనియర్ విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు 18న హై స్కూల్ నందు చిత్రలేఖనం 19న ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులుప్రాథమిక పాఠశాల లో ఆటల పోటీలు 20వ తేదీన డిజిటల్ లైబ్రరీ వినియోగం పై ఒరింటేషన్ మరియు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు బహుమతుల ప్రధానం జరుగును. ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మళ్లీ ఎందుకు వస్తున్నావు మోడీ :ఏఐటియుసి



విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది ప్రజల నోట్లో పిడికెడు మట్టి కొట్టి వెళ్లి మళ్లీ ఎందుకు విశాఖ పర్యటనకు వస్తున్నావు, వచ్చే అర్హత కూడా కోల్పోయామని ఏపీఎండిసి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరు మురళి, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎం.గంగాధర్ మోడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మోడీ గో బ్యాక్ అంటూ మంగంపేటలో ఏఐటియుసి అధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి, వైసిపి పార్టీలు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల భవిష్యత్తును భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2024 కు ముఖ్యమంత్రి పదవుల కోసం పోటీలు పడుతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, జగన్మోహన్ రెడ్డి విభజన హామీలపై మోడీని నిలదీయాలని డిమాండ్ చేశారు. ఏపీఎండిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మునిశేఖర్, లక్ష్మీనారాయణ, హరి, రామచంద్రయ్య, మణికంత, వాసు, చంగల్ రాయుడు, రసూల్, రామచంద్రారెడ్డి, త్రివేణి కంపెనీ యూనియన్ నాయకులు వెంకటరమణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని నిరసన తెలిపారు.